# టీటీడీలో అన్యమతస్తులు.. నలుగురు ఉద్యోగులు సస్పెండ్

హైదరాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమత ఉద్యోగులపై టీటీడీ వేటు వేసింది. ఇతర మతాలకు చెందిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. నాణ్యతా విభాగంలో డిప్యూటీ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బీ.ఎలిజర్, బర్డ్ దవాఖానలో స్టాఫ్ నర్సు ఎస్.రోసి, గ్రేడ్–1 ఫార్మాసిస్ట్ ఎం. ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో విధులు నిర్వహిస్తున్న జీ.అసుంతను సస్పెండ్ చేశారు. క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చిన టీటీడీ.. వారిపై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. హిందూ ధార్మిక సంస్థలో ఉంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహించారని పేర్కొన్నది.కాగా, ఇటీవల (ఈ నెల 11న) తిరుమల శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. టీటీడీలో 1000 మందికిపైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మసీదులు, చర్చిల్లో బొట్టుపెట్టుకునే హిందువులకు కూడా ఉద్యోగాలిస్తారా? చెప్పాలన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ అనవాయితీని ఎందుకు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :127 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 20-07-2025 పేజీలు:4 వెల: 2.00

## కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్ట్రాంగ్ వార్నింగ్



హనుమకొండ: మాజీమంత్రి కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. వరంగల్‌కు ఇచ్చిన హామీలను మరిచిన దొంగ కేటీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసే అభివృద్ధి కేటీఆర్‌కి కనిపించడం లేదా... కళ్లు కనిపించకపోతే డాక్టర్ వద్దకు తీసుకుపోతానని ఎద్దేవా చేశారు నాయిని రాజేందర్ రెడ్డి.ఇవాళ(శనివారం) హనుమకొండలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పదేళ్లలో తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. పదిమంది లంపెన్ గ్యాంగులతో కేటీఆర్.. కాంగ్రెస్ నేతలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు నాయిని రాజేందర్ రెడ్డి.తాము తలచుకుంటే రోడ్లపై కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు తిరగలేరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి రాకముందు దూకుడుగా ఉండేవాళ్లమని... ఇప్పుడు తమ చేతులని హై కమాండ్ కట్టేస్తోందని చెప్పుకొచ్చారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తుపై మీ చెల్లె కవిత చెప్పింది నిజం కాదా అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్: ఎమ్మెల్యే నాగరాజు

మాజీమంత్రి కేటీఆర్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్ అని ఎద్దేవా చేశారు. ఇవాళ(శనివారం) హన్మకొండలో మీడియాతో నాగరాజు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కేటీఆర్ ఆర్థిక నేరస్తుడని.. ఆయన కుటుంబం అంతా నేరపూరితమైందని ఆరోపించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా రొయ్యల పులుసుకు మీ నాన్న కేసీఆర్ అలవాటు పడితే.. నువ్వు లెగ్గులు,పెగ్గులకు అలవాటు పడ్డావని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రజల్లోకి రాకుండా ఫాంహౌస్‌లో ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే నాగరాజు ప్రశ్నించారు.

## హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం

హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లో ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌లుగా ఇప్పటి వరకు ఆరుగురు పనిచేశారు. త్రిపుర హైకోర్టు నుంచి బదిలీపై వచ్చిన జస్టిస్ ఏకే సింగ్ ఏడో చీఫ్ జస్టిస్. ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి హైకోర్టు న్యాయమూర్తులు, శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. కాగా, హైకోర్టులో మొత్తం జడ్జీల సంఖ్య 42 కాగా ప్రస్తుతం 26 మంది పనిచేస్తున్నారు. ఇద్దరు జడ్జీల బదిలీ.. ఒకరి చేరికతో ఆ సంఖ్య 25కు తగ్గింది.న్యాయకోవిదుల కుటుంబంలో మూడో తరానికి చెందిన జస్టిస్ ఏకే సింగ్ 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధ సింగ్ దంపతులకు జన్మించారు. ఆయన తల్లివైపు కుటుంబానికి చెందిన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా, మరో తాత జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందిన ఏకే సింగ్ 1990లో ఉమ్మడి పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో,



2001 నుంచి 2012 వరకు జార?ండ్ హైకోర్టులో న్యాయవాదిగా పలు కీలక కేసులు వాదించారు. 2012లో జార?ండ్ హైకోర్టు అదనపు న్యాయయమూర్తిగా, 2014లో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2022లో జార?ండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా సేవలు అందించారు. 2023లో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. తాజాగా తెలంగాణ హైకోర్టు సీజేగా బదిలీపై వచ్చారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షాలు.. తెలంగాణ ప్రభుత్వం అలర్ట్

హైదరాబాద్: భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు సంబంధింత అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వర్షాలపై స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలపై ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్.

అధికారులను అప్రమత్తం చేస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్

ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్,హైడ్రా కమిషనర్, పోలీస్ కమిషనర్, వాటర్‌వర్క్స్, ఇతర అధికారులను అప్రమత్తం చేస్తూ వారితో మాట్లాడామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. ప్రజలు ఆందోళన చెందవద్దని చెప్పారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి వర్షపు నీళ్లు ఎక్కడ నిల్వ లేకుండా సిబ్బంది వెంటనే తొలగిస్తున్నారని వెల్లడించారు. 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌పై అధికారులు సమన్వయం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఎలాంటి



సమస్యలు లేకుండా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలకి ఏమైనా ఇబ్బందులు వస్తే త్వరగా పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ,రెవెన్యూ, పోలీస్ అధికారులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని..ఏదైనా విపత్తు వస్తే అధికారులకు వెంటనే సమాచారం అందించాలని మంత్రి పొన్నం సూచించారు.

## 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించండి..



న్యూఢిల్లీ,2036 ఒలింపిక్స్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర హోంమంత్రి వెల్లడించారు. ప్రపంచ పోలీస్–ఫైర్ క్రీడల్లో పతకాలతో సత్తా చాటిన భారత బృంద సభ్యులను అమిత్ షా ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా21వ ప్రపంచ పోలీస్ మరియు అగ్నిమాపక క్రీడల్లో భారత బృందం 613 పతకాలు గెలుచుకోవడం పట్ల హోంమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. పోలీసు మరియు అగ్నిమాపక సేవల బృందం అద్భుతమైన ప్రదర్శనకు.. దేశాన్ని గర్వపడేలా చేసినందుకు అభినందిస్తున్నట్లు చెప్పారు.2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడంలో భారత్ టాప్–5లో ఉండాలని అమిత్ షా ఆకాంక్షించారు. అందుకోసమే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగా 3,000 మంది అథ్లెట్లకు ప్రభుత్వం నెలకు రూ.50,000 సాయం అందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 10 సంవత్సరాలుగా క్రీడలకు గొప్ప ప్రాముఖ్యత ఇచ్చినట్లు అమిత్ షా గుర్తుచేశారు.ఇక 2036లో ఒలింపిక్ క్రీడల నిర్వహణకు భారతదేశం బిడ్ వేయబోతుందని చెప్పారు. ఈ పోటీల్లో పతకాల జాబితాలో భారత్ మొదటి ఐదు స్థానాల్లో ఉండాలని విశ్వాసం వ్యక్తం చేశారు. గెలుపు, ఓటమి జీవితానికి శాశ్వత చక్రం అని, గెలవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, విజయం కోసం ప్రణాళిక వేయడం ప్రతి ఒక్కరి స్వభావం కావాలన్నారు. గెలవడం అలవాటు కావాలని హోంమంత్రి అన్నారు. గెలిచే అలవాటును పెంపొందించుకునే వారు ఎల్లప్పుడూ అసాధారణంగా రాణిస్తారన్నారు. ప్రతి గ్రామానికి క్రీడలను తీసుకెళ్లడానికి మోడీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. ప్రతి క్రీడలో వివిధ వయసుల పిల్లల ఎంపిక మరియు శిక్షణ శాస్త్రీయంగా జరుగుతోందని ఆయన అన్నారు.గతంలో 2032 వేసవి ఒలింపిక్స్‌ను నిర్వహించడానికి భారతదేశం ఆసక్తిని వ్యక్తం చేసింది. కానీ తర్వాత 2036 వేసవి ఒలింపిక్స్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు బిడ్ చేయడానికి సిద్ధపడుతోంది. 2021లో అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ని కన్సల్టెంట్‌గా నియమించింది, అహ్మదాబాద్, గాంధీనగర్‌లోని 22 ప్రదేశాలను ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ అనే పెద్ద క్రీడా సముదాయాన్ని అహ్మదాబాద్‌లో నిర్మిస్తున్నారు , ఇందులో అనేక బహుళ–క్రీడా వేదికలు ఉంటాయి. ఒలింపిక్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

## నేను ఎవరికీ భయపడేది లేదు... బండి సంజయ్‌కి స్ట్రాంగ్ కౌంటర్



హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కి బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హుజురాబాద్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శామీర్‌పేట్‌లోని ఈటెల రాజేందర్ ఇంటికి ఇవాళ(శనివారం) కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఈటెల రాజేందర్ మాట్లాడారు. హుజురాబాద్ తెలంగాణ ప్రతికకు అడ్డా అని ఉద్ఘాటించారు. ఇక నుంచి అక్కడ స్ట్రైట్ ఫైట్ ఉంటుందని.. స్ట్రీట్ ఫైట్ మాత్రం ఉండదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలను దాటి తాను ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు. అప్పుడు కేసీఆర్ తన విషయంలో చేసింది అదేనని గుర్తుచేశారు. అయినా హుజురాబాద్ బిడ్డలు తనను కాపాడుకున్నారని ఉద్ఘాటించారు. తాను అలాగే వారిని కాపాడుకుంటానని మాటిచ్చారు. దక్షిణ భారతదేశంలో తన నియోజకవర్గానికి నేరుగా వచ్చి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశం పెట్టారని గుర్తుచేశారు ఎంపీ ఈటెల రాజేందర్.శత్రువుతో కొట్లాడవచ్చు కానీ కడుపులో కత్తులు పెట్టుకొనే వారితో పోరాటం చేయలేమని విమర్శించారు. భారతీయ జనతా పార్టీలో అన్నిరకాల అంశాలని పరిగణనలోకి తీసుకుంటారనే ఈ పార్టీలో చేరానని చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను తొక్కని ఇంటి గడప లేదని.. తనకు తెలియని వారు లేరని... బీసీ బిడ్డగా తాను మంత్రి పదవులు పొందానని గుర్తుచేశారు. వీరుడు ఎక్కడ భయపడడు. హుజురాబాద్ గడ్డ మీద తన ప్రతి అనుచరుడు ఉంటారని వెల్లడించారు. తన సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు కూడా ఉంటారని తెలిపారు. దేశ ప్రధాని మోదీ వ్యక్తుల కోసం కాకుండా.. వ్యవస్థ నిర్మాణం కోసం పని చేస్తున్నారని నొక్కిచెప్పారు. మనమంతా దేశ ధర్మం కోసం కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో కొంతమంది ఉంటారని.. వారు ఇతరులను ఎదగనివ్వకుండా చేయడమే వాళ్ల పని అని విమర్శించారు ఎంపీ ఈటెల రాజేందర్.కచ్చితంగా హుజురాబాద్ వస్తా.. మీ వెంట ఉంటానని హామీ ఇచ్చారు. తనను ఏడుసార్లు గెలిపించారని... ఎవరికీ భయపడేది లేదని ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో చిన్న మనస్కులు, కురుసా మనస్తత్వం ఉన్న వాళ్లు ఉంటారని తెలిపారు. వాళకడుపులో కత్తులు పెట్టుకొని ఉంటారని.. అలాంటిది వారితో యుద్ధం చేయడం కష్టమే కానీ ఎదురెళ్లి నిలబడాలని చెప్పుకొచ్చారు. ఇక నుంచి హుజురాబాద్‌లో ప్రతి మండలానికి ఒక కార్యాలయం ఉంటుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ,కేసీఆర్ లాంటి వాళ్లతో తాను కొట్లాడానని గుర్తుచేశారు. సముద్రంలో తుఫాన్ వచ్చే ముందు సైలెంట్‌గా ఉంటుందని చెప్పుకొచ్చారు. తన లాంటి వాళ్లు మాట్లాడితే సమాజం రియాక్ట్ అవుతుందని.. తాను ప్రజల నుంచి వచ్చిన వాడినని, ప్రజలే తనకు న్యాయ నిర్ణేతలని ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.

## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపా.. ట్రంప్ నోట మళ్లీ అదే మాట

వాషింగ్టన్,భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ మళ్లీ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలను భారత ప్రభుత్వం అనేక మార్లు ఖండించింది. ఇరు దేశాల మధ్య చర్చల కారణంగానే కాల్పుల విరమణ జరిగిందని..ఇందుకు మూడో వ్యక్తి ప్రమేయం ఏ మాత్రం లేదని భారత్ అనేక మార్లు మీడియా సముఖంగా ప్రకటించింది. కానీ తాజాగా శుక్రవారం రిపబ్లికన్ శాసనసభ్యులతో జరిగిన ఒక ప్రైవేట్ విందులో ట్రంప్ మాట్లాడుతూ.. భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపింది తానేనట్లుగా వెల్లడించారు. వాణిజ్యం ద్వారానే ఇరు దేశాల మధ్య సమస్యను పరిష్కరించినట్లు చెప్పుకొచ్చారు. అంతేకాకుండా నాలుగు రోజులు యుద్ధంలో ఐదు జెట్‌లు కూలిపోయాయని చెప్పారు. ఎక్కడా? ఏంటి? అనేది మాత్రం వెల్లడించలేదు.ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపినందుకే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ వైట్‌హౌస్‌కు వచ్చి నోబెల్ శాంతి బహుమతికి తనకు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. భారత్–పాకిస్థాన్ రెండు దేశాలు అణు దేశాలే.. మరింత ఉద్రిక్తం కాకుండా ఉండేందుకే యుద్ధాన్ని అడ్డుకున్నట్లు చెప్పారు.నోబెల్ శాంతి బహుమతి పొందాలని ట్రంప్ ఎప్పటి నుంచో కలలు కంటున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఏం జరిగినా దానికి క్రెడిట్ ట్రంప్ తీసుకుంటున్నారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య, హమాస్–ఇజ్రాయెల్ మధ్య, రష్యా–ఉక్రెయిన్ మధ్య, భారత్–



పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తానే తగ్గించినట్లుగా ట్రంప్ చెప్పుకుంటున్నారు. ఇక ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి ఇప్పటికే పాకిస్థాన్, ఇజ్రాయెల్ దేశాలు మద్దతు తెలిపాయి.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడి జరిగింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా దెబ్బతిన్నాయి. అనంతరం ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించాయి.

## పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని ఎలా అంటారు

హైదరాబాద్,జూలై19: పదేళ్లు నేనే సిఎం అని రేవంత్ రెడ్డి అనడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఇలా అనడం కాంగ్రెస్‌లో లేదని ఆయన శనివారం ట్వీట్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటె–డ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు– చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... 2034 వరకు ఈ పాలమూరు బిడ్డ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటాడని, పాలమూరు గడ్డ నుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తాడని అన్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ రేవంత్ వ్యాఖ్యలను తప్పు పట్టారు. రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి ప్రకటించు కోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం అన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉ



ంటుంది. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరుని అంటూ కామెంట్ రాశారు.

## మరో రెండు విదేశీ పర్యటనలకు మోడీ..



న్యూఢిల్లీ,ప్రధాని మోడీ మరో రెండు విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. జూలై 23–26 తేదీల్లో యూకే, మాల్దీవుల్లో మోడీ పర్యటించనున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ తెలిపింది.ఇటీవలే ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనకు వెళ్లొచ్చారు. కొద్ది రోజుల గ్యాప్‌లనే మరో రెండు విదేశీ పర్యటనలకు వెళున్నారు.23, 24 తేదీల్లో మోడీ యునైటెడ్ కింగ్‌డమ్‌లో పర్యటించనున్నారు. అక్కడ భారతదేశం–యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై సంతకం చేయనున్నారు. ఈ ఒప్పందం ద్వారా భారతీయ ఎగుమతులపై ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయంగా భారతదేశానికి విస్కీ, కార్ల వంటి బ్రిటిష్ ఎగుమతులపై సుంకాలు తగ్గనున్నాయి.ఇక జూలై 25–26 తేదీల్లో ప్రధాన మోడీ మాల్దీవుల్లో పర్యటించనున్నారు. గతేడాది ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రధాని మోడీపై మాల్దీవుల మంత్రులు నోరుపారేసుకున్నారు. దీంతో భారతీయ టూరిస్టులు.. మాల్దీవులు వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో నష్టాన్ని గుర్తించిన మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు దిగొచ్చారు. గతేడాది ఢిల్లీలో జరిగిన మోడీ ప్రమాణస్వీకారానికి మాల్దీవుల అధ్యక్షుడు హాజరయ్యాడు. మొత్తానికి రాజకీయ ఉద్రిక్తతల తర్వాత మోడీ మాల్దీవుల్లో పర్యటించడం ఇదే తొలిసారి. అంతేకాకుండా మొహమ్మద్ ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడు అయ్యాక మోడీ పర్యటించడం కూడా ఇదే ప్రథమం.ఇక మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవ వేడుకలకు మోడీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 2019లో మోడీ మాల్దీవులకు వెళ్లారు. రాజకీయ ఉద్రిక్తతల తర్వాత తిరిగి ఇన్నాళ్లకు మాల్దీవులకు మోడీ వెళ్తున్నారు. ఈ పర్యటనలతో తిరిగి దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడనున్నాయి. అంతేకాకుండా మాల్దీవుల టూరిజం కూడా పుంజుకునే అవకాశం ఉంది.

సంపాదకీయం
ఆదివారం 20-07-2025

# ఎగుమతుల వృద్ధిలో ఒడుదొడుకులు

స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో భారతదేశం జపాన్‌ను అధిగమించిందని ఐఎంఎఫ్ ఇటీవల తెలిపింది. జపాన్ జీడీపీ 4.186 లక్షల కోట్ల డాలర్లయితే ఇండియాది అంతకు కాస్త ఎక్కువని తేల్చింది. అయితే అంతర్జాతీయ వాణిజ్యంలో 2023లో భారత్ వాటా కేవలం 2.1శాతమే. ప్రపంచ ఎగుమతుల్లో తన వాటాను 2027కల్లా మూడు శాతానికి, 2047కల్లా పది శాతానికి పెంచుకోవాలని భారత్ లక్ష్యిస్తోంది.జపాన్ అనగానే బులెట్ రైళ్లు, శుభ్రమైన రహదారులు, హైటెక్ పరిశ్రమలు గుర్తుకొస్తాయి. జపనీయుల ఉన్నత జీవన ప్రమాణాలు మదిలో మెదులుతాయి. మరి భారతదేశం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన తరవాత ప్రజల జీవితాలు ఎంతవరకు మారాయనే ప్రశ్న తలెత్తుతుంది. చైనా గతంలో నాలుగు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగినప్పుడు అక్కడి ప్రజల తలసరి ఆదాయం 3500 డాలర్లకు పెరిగింది. దశాబ్దాల పర్యంతం ఆర్థిక సంస్కరణల వల్ల ఇప్పుడు చైనా తలసరి ఆదాయం 13వేల డాలర్లకు పైగానే ఉంది. నేడు చైనా జీడీపీ 19.23 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. భారత్ జీడీపీ నాలుగు లక్షల కోట్ల డాలర్లను మించినా, అందులో 40శాతం (1.6 లక్షల కోట్ల డాలర్ల) వాటా జనాభాలో ఒక శాతమైన అతి సంపన్నుల గుప్పిట్లోనే ఉంది. మిగిలిన 2.5 లక్షల కోట్ల డాలర్లను 99శాతం జనాభా పంచుకోవాలన్నమాట. అలా 140 కోట్లమందికి పంచితే తలసరి ఆదాయం 1710 డాలర్లుగా లెక్కతేలుతుంది.

**వెనకబాటుకు ఎన్నో కారణాలు**

జీడీపీ వృద్ధికి ఊతమిచ్చే రంగాలు అత్యధిక ప్రజానీకానికి ఉపాధి కల్పించకపోవడం వల్లనే మన తలసరి ఆదాయం తక్కువగా ఉంది. ఇప్పటికీ ఇండియా జనాభాలో 50శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా జీడీపీలో సాగు రంగం వాటా కేవలం 18శాతమే. పైగా దేశీయంగా వ్యవసాయం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. సాగుదారుల ఆదాయాలు పెరగట్లేదు. సేద్యం దండగలా మారింది. పైగా, దేశీయంగా హెక్టారు పంట భూమి ఉత్పాదకత పాశ్చాత్య సంపన్న దేశాలకన్నా, తోటి ఆసియా దేశాలకన్నా చాలా తక్కువ. స్వీయ వాణిజ్య రక్షణ విధానాలు విదేశీ పెట్టుబడులకు, సాంకేతికతలకు అడ్డుగా నిలిచాయి. స్వదేశంలోనే వస్తుసేవల వినియోగానికి పెద్దపీట వేసి ఎగుమతులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ తన వాటా పెంచుకోలేకపోయింది. మనకు భిన్నంగా చైనా ఎగుమతి కేంద్రిత ఆర్థిక వ్యవస్థతో దూసుకుపోయింది. భారత్‌లో పరిశ్రమలు విస్తరించకపోవడానికి ప్రధాన కారణాల్లో ఇంధన కొరత కూడా ఒకటి. ఇంధన అవసరాలకు దిగుమతులపైనే ఆధారపడటం వల్ల ఇండియాలో పారిశ్రామిక ఉత్పత్తి వ్యయం అధికంగా ఉంటోంది. చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడాల్సిన అగత్యాన్ని అధిగమించాలంటే పునరుత్పాదక ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవాలి. ఈ విషయంలో భారత్ సాధించాల్సింది ఇంకా చాలా ఉంది. సౌర ఫలకాలను సొంతంగా తయారుచేసుకుంటే తక్కువ ఖర్చుకే సౌర విద్యుదుత్పాదన చేయవచ్చు. కానీ, ఆ ఫలకాల కోసం ఇప్పటికీ చైనాపైనే ఆధారపడటం వల్ల మన సౌర విద్యుదుత్పాదన వ్యయం ఎక్కువగా ఉంటోంది. పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ)కి భారత్ తగినంతగా నిధులు కేటాయించకపోవడం వల్ల పారిశ్రామిక ప్రగతి కుంటుపడుతోంది. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి, దండిగా నిధులు కేటాయించిన అమెరికా, జర్మనీ, చైనాలు ఆర్థికంగా అగ్రస్థానాల్లో ఉన్నాయి. భారత్ దిగుమతులకు ప్రత్యామ్నాయాలను కనుగొని, స్వదేశంలో వినియోగాన్ని పెంచడంపై చూపిన శ్రద్ధ ఎగుమతులపై చూపకపోవడం ఆర్థికంగా సత్ఫలితాలను ఇవ్వలేదు. అంతర్జాతీయ వాణిజ్యంలో మన వాటా పెరగలేదు.

**సుంకాల సమరం ప్రతికూలమే**

భారత్ మొదటి నుంచీ రేవులు, రహదారులు, రవాణా, విద్యుత్ కేంద్రాల వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వకపోవడం వల్ల పరిశ్రమలు, ఎగుమతులు వృద్ధి చెందలేదు. ఇతర దేశాలు సుంకాల రూపంలో అడ్డంకులు సృష్టించడమూ మన ఎగుమతులను నీరుగార్చింది. స్వదేశంలోను రాష్ట్రాల మధ్య వాణిజ్యపరమైన అడ్డంకులు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా చేస్తున్న సుంకాల సమరం ఆందోళన రేపుతోంది. వాణిజ్య యుద్ధాలు ముదరడం భారతీయ ఎగుమతులకు శుభపరిణామం కాదు. అమెరికా, బ్రిటన్, ఈయూలతో సానుకూలమైన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి భారత్ కృషిచేస్తోంది. దీంతోపాటు అధునాతన మౌలిక వసతులను విస్తరించి, పరిశోధన-అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి ఎగుమతులను ప్రోత్సహించే విధానాలకు పెద్దపీట వేయాలి. తద్వారా జీడీపీని, తలసరి ఆదాయాలను మరింత పెంచుకోవడానికి అవకాశం లభిస్తుంది.

# 'నాటో'కు టారిఫ్ అంటువ్యాధి!



రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే 100 శాతం సుంకాలు విధించగలమని భారత దేశానికి 'నాటో' సెక్రటరీ జనరల్ ఈ నెల 16న చేసిన హెచ్చరికను చూసిన వారికి ఆశ్చర్యం కలగటంతోపాటు నవ్వువచ్చి ఉండాలి. నెదర్లాండ్స్ లేదా డచ్ దేశానికి చెందిన ఆయన పేరు తమ భాషలో మర్క్ ర్రిట్టర్. కాని ఇంగ్లీష్‌లో స్పెల్లింగ్‌నుబట్టి మార్క్ రూట్ అని, మార్క్ రుట్టర్ అని వ్యవహరిస్తుంటారు. మనం మర్క్ ర్రిట్టర్ అనే అందాము. తను హెచ్చరిక చేసింది ఇండియాతో పాటు చైనా, బ్రెజిల్‌కు కూడా. అది మనకు ఆశ్చర్యం కలిగించి నవ్వు తెప్పించటానికి కొన్ని కారణాలున్నాయి. తను సెక్రటరీ జనరల్ అయిన నాటో కేవలం సైనిక కూటమి. వ్యాపార వాణిజ్యాలతో సంబంధం లేనిది. పాశ్చాత్యుల వాణిజ్య ప్రయోజనాల కోసం సైన్యాలను ఉపయోగించే సంప్రదాయం ఉన్న మాట నిజమే. కాని ప్రస్తుతం అటువంటి సందర్భం ఏమీ ఏర్పడలేదు.ఒకవేళ ఏర్పడినా ఆయన బలప్రయోగం గురించి మాట్లాడాలి తప్ప, ఆర్థిక ఆంక్షలు, టారిఫ్‌ల హెచ్చింపు గురించి కాదు. ఆ మాటలు రష్యా ఉక్రెయిన్ యుద్ధం సాగుతున్న మూడేళ్లలో తను ఎపుడూ అన్నట్లు కూడా లేరు. కనుక ఆ హెచ్చరికలు చేయవలసిన బాధ్యత వాణిజ్య వ్యవహారాలు చూసే యూరోపియన్ యూనియన్(ఇయు)ది. ఈ విషయాలన్నీ ర్రిట్టర్‌కు తెలియవనలేము. అయినప్పటికీ ఎందుకు మాట్లాడినట్లు? బహుశా ఒక కారణం ఉండి ఉంటుంది. తన హెచ్చరికకు వారం రోజుల క్రితం బ్రెజిల్ నగరమైన రియో డి జనేరోలో జరిగిన బ్రిక్స్ 17వ సమావేశాలలో ఇండియా, చైనా, బ్రెజిల్, రష్యా కూడా పాల్గొన్నాయి. రష్యాపై అమెరికాతోపాటు యూరోపియన్ యూనియన్ కలిసి అక్షరాలా వేలాది ఆంక్షలు విధించాయి. దానితో రష్యా విదేశ వాణిజ్యం ముగిసిపోయి, ఆర్థిక వ్యవస్థ కుప్పగూలి, ఇక యుద్ధం కొనసాగించలేని పరిస్థితి వస్తుందని అంచనా వేసాయి. కాని అవన్నీ లెక్క తప్పాయి.మూడేళ్లు గడిచినా అదేమీ జరగకపోగా, ఇటీవలి వివరాల ప్రకారం రష్యా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడింది. అందుకు తగిన కారణాలున్నాయి. వారితో భారత్, చైనా, బ్రెజిల్ సహా అనేకానేక ప్రపంచ దేశాలు తమ వాణిజ్య, ఆర్థిక సంబంధాలను యథాతథంగా కొనసాగిస్తున్నాయి. అమెరికా, ఇయులు ఎన్ని విధాలుగా ఎంత ఒత్తిడి చేసినా, తమపై కూడా కొన్ని ఆంక్షలు ప్రకటించినా వెనుకకు తగ్గటం లేదు. మీ ప్రయోజనాలు మీవి అయితే, మా అవసరాలు మావి అని స్పష్టంగా పలుమార్లు తేల్చిచెప్పాయి. ఇందులో ఒక విచిత్రం ఏమంటే, స్వయంగా యూరోపియన్ యూనియన్ కూడా రష్యాతో వాణిజ్యాన్ని గణనీయంగా తగ్గించటమైతే చేసింది గాని పూర్తిగా మానివేయలేదు. ఇప్పటికీ పెట్రోలియం, సహజ వాయువు, ఎరువులు, ఉక్కు, నికెల్ వంటి సరకులను దిగుమతి చేసుకుంటున్నది. రష్యాపై ఆంక్షలను పాటించకపోవటంపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాశ్చాత్య దేశాల నాయకుల నుంచి మీడియా నుంచి ఎన్నోసార్లు ప్రశ్నలను ఎదుర్కొన్నారు.ఆయన వారికి కటువుగా కూడా అనిపించే స్వరంతో మూడు ఎదురు ప్రశ్నలు వేస్తూ వచ్చారు. మా వాణిజ్యం వల్ల రష్యాకు నిధుల లభించి యుద్ధాన్ని కొనసాగిస్తున్నదనుకుంటే మరి మీరెందుకు వాణిజ్యం చేస్తున్నారు? ముందుగా అది ఆపివేయండి అన్నది మొదటి మాట. ఉక్రెయిన్ యుద్ధం మీ సమస్యే తప్ప మాది కాదుగదా? అన్నది రెండవ మాట. మాకు సమస్యలు వచ్చినపుడు మీరు ముందుకు రానపుడు మీ సమస్యల కోసం మేమెందుకు తోడురావాలన్నది మూడవది. వీటివేటికీ వారినుంచి సమాధానాలు లేవు. జైశంకర్ తీరు బోధపడటంతో ఇటీవల వారు ఆ ప్రశ్నలు వేయటం మానివేసారు.ఇదే తరహా ప్రశ్నలను వారు చైనా, బ్రెజిల్‌కు గాని, రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న ఇతర దేశాలకుగాని వేసే వారేమో తెలియదు. కాని, రష్యా వలెనే ఇరాన్‌తో చమురు దిగుమతులు ఆపివేయాలని భారత ప్రభుత్వాన్ని అమెరికా, ఇయులు రకరకాలుగా ఒత్తిడి చేసి విఫలమయ్యాయి. వారికి చైనాను ఒత్తిడి చేయటం వివిధ కారణాల వల్ల సాధ్యమయేది కాదు.కాని ఇండియా, బ్రెజిల్ వంటి దేశాలపై చేయగలమనుకున్నారు. ఇండియాకు చమురు అవసరాలు తీరనట్లయితే ఆర్థిక రంగం తీవ్రంగా దెబ్బతింటుంది. పైగా, జైశంకర్ ప్రస్తావించిన ఇతర ప్రశ్నలు కూడా ముఖ్యమైనవే. కావలసిందల్లా రాజకీయంగా స్వతంత్రమైన, స్పష్టమైన వైఖరి తీసుకుని ధైర్యంగా నిలవటం. ఆ పని మోడీ ప్రభుత్వం చేసింది. ఇందులో ఆర్థికపరమైన కోణం ఉన్నప్పటికీ, అందుకు రాజకీయ కోణం కూడా తోడైతే తప్ప అటువంటి వైఖరి తీసుకోలేరు. నిజానికి ఈ సరికి పాశ్చాత్య ప్రపంచానికి, బయటి దేశాలన్నింటికి ఉక్రెయిన్ యుద్ధ రహస్యాలు అర్థమైపోయాయి. కనుకనే దానిని పాశ్చాత్యులు తమ సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఉక్రెయిన్‌ను పావుగా వాడుకుంటూ సాగిస్తున్నట్లు గ్రహించి వ్యవహరిస్తున్నాయి. వారికోసం తమ ప్రయోజనాలను వదలుకునేందుకు సిద్ధపడటం లేదు.నాటో ర్రిట్టర్‌కు ఇదంతా తెలియనిదా? అయినా, అమెరికా విఫలమైన, ఇయు విఫలమైన రంగంలోకి, నాటోతో సంబంధంలేని చోటకు తానెందుకు అడుగు పెట్టినట్లు? తన బెదిరింపును అందరూ నవ్వి కొట్టివేస్తారని గ్రహించలేకపోయారా? అదట్లుంచి ఇండియా, చైనా, బ్రెజిల్ ఆర్థికంగానే కాక అన్ని విధాలా ప్రముఖమైనవి. వాటిపై 100 శాతం సుంకాలు విధిస్తే, అక్కడి నుంచి ఎగుమతి దిగుమతులు ఆగిపోతే ఎవరికెంత నష్టమనే లెక్కలు ర్రిట్టర్ వేసుకున్నారో లేదో తెలియదు గాని మన వద్ద నైతే లేవు. అయినా మనకు గల పరిమిత పరిజ్ఞానాన్ని బట్టి చెప్పాలంటే, నష్టాలు రెండు వైపులా ఉంటాయి. ఒకవేళ అమెరికా, ఇయుల ఆర్థిక పరిస్థితులు గొప్పగా ఉండి ఉంటే కొంత నష్టాన్ని భరించి అయినా ఈ మూడు దేశాలను లొంగదీయగలమనుకోవచ్చు. కాని అటువంటి పరిస్థితి లేదు. వెనుక ముందు ఆలోచించకుండా పెంచిన టారిఫ్‌లతో ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే సతమతమవుతున్నది.యూరప్‌లో అన్నింటికన్న శక్తివంతమైన జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్ సహా అన్ని దేశాలు ఆర్థిక సమస్యలలో ఉన్నాయి. ఆ కారణంగా ఒకవైపు ధరలు, నిరుద్యోగం పెరుగుతుండగా, మరొకవైపు ఉదారవాద మధ్యేమార్గ పార్టీలు బలహీనపడుతూ, మితవాద పక్షాల బలం పెరుగుతున్నది. ఇటువంటి స్థితిలో భారత్, చైనా, బ్రెజిల్‌లతో వాణిజ్య సంబంధాల విచ్ఛిత్తిని యూరప్ తట్టుకోగలదా? ఇంతకూ అటువంటి దుస్సాహసం చేసి సాధించగలది ఏమైనా ఉంటుందా? మనకైతే ఏమీ కనిపించటం లేదు. ఈ సుంకాలకు భయపడి ఈ దేశాలు రష్యాతో వాణిజ్య సంబంధాలు ఆపివేసే అవకాశం లేదు. యుద్ధం నుంచి రష్యా ఉపసంహరించుకోబోదు. యుద్ధాన్ని 24 గంటలలో ఆపివేయగలనని ఒక సదుద్దేశాన్నయితే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ఎట్లా ముందుకుపోవాలో తెలియక ఆరుమాసాల తర్వాత కూడా తలపట్టుకుంటున్నారు.అందరూ కలిసి ఉక్రెయిన్‌కు కుప్పతెప్పలుగా ఆయుధాలు, నిధులు అందజేసి కూడా గెలిపించలేకపోతున్నారు. గెలుపు మాట అట్లుంచి ఉక్రెయిన్ భూభాగాలను రష్యా నెమ్మదిగానైనా క్రమంగా ఆక్రమిస్తున్నది. యుద్ధానికి పరిష్కారం కనుగొనే వరకు ఇదిట్లా సాగుతూనే ఉంటుంది. అటువంటపుడు, హాలండ్‌కు లోగడ ప్రధానిగా కూడా పనిచేసి, నాటో సెక్రటరీ జనరల్ వంటి బాధ్యతాయుతమైన స్థానంలో గల మర్క్ ర్రిట్టర్ వంటి నాయకుడు 100 శాతం సుంకాలంటూ బెదిరించటం ఎంత హాస్యాస్పదం! యుద్ధం ముగియాలన్నది నిజంగా ఆయన

# కల్తీ కల్లు కల్లోలంలో బాల్యం

హైదరాబాద్,తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో పిల్లలు ఉయ్యాల తొట్టినుంచి బయటకు వచ్చేసరికి కల్తీకల్లుకు బానిసలై పోతున్నారు. కల్తీకల్లు కారణంగా ఏడుగురు ఇటీవల ప్రాణాలు కోల్పోయిన సంఘటన సంచలనం కలిగించింది. ఈ సంఘటనలో మరో చీకటి కోణం బయటపడింది. ఆల్ప్రాజోమ్ (ఎక్సనాక్స్) డయాజిపామ్ (వాలియమ్) క్లోర్‌డయాజిపాక్సైడ్ (లిబ్రియమ్) వంటి మత్తుమందులు కలిపిన కల్లుకు పిల్లలు బానిసలవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. ఈ పిల్లల్లో కొంతమంది రెండేళ్ల వయసువారు కూడా ఉన్నారు. వారింకా కాళ్లమీద నిలబడడం నేర్చుకోకముందే మూర్ఛ, నిద్రలేమి, జ్వరం వంటి లక్షణాలతో వారిని డాక్టర్ల వద్దకు తల్లిదండ్రులు తీసుకు వస్తున్నారు. తెలంగాణలో పిల్లలు అల్లరి చేయకుండా సమాధానపర్చడానికి, నిద్రపుచ్చడానికి వారిచే కల్లు తాగించడం తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలకు అలవాటుగా వస్తోంది. కానీ కల్లులో విపరీతమైన మత్తు పదార్థాలు కలిసి ఉంటాయని తల్లిదండ్రులు తెలుసుకోవడం లేదు.కొవిడ్ మహమ్మారి వ్యాపించిన దగ్గరి నుంచి ఈ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని ప్రతినెలా నాలుగైదు కేసులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. కరోనా సమయంలో ఇంటిదగ్గరే చాలా మంది ఉండిపోవలసివచ్చింది. ఆ సమయంలో చాలా మంది కల్లు తాగడం అలవాటుగా చేసుకున్నారు. కల్లు తాగితే ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు రావన్న గుడ్డి నమ్మకం చివరకు కల్లుకు బానిసలుగా మార్చింది. ఒకటిన్నర ఏళ్ల వయసు బాలికకు బాగా నిద్రపట్టడానికి ఆమె అమ్మమ్మ ఒక చెంచాడు కల్లును రోజూ తాగించడాన్ని నిలోఫర్ ఆస్పత్రికిచెందిన డాక్టర్లు గమనించడం విశేషం. తెలంగాణలో అల్ప్రాజోలమ్ లేదా కొన్ని రసాయనాలు కలిపిన కల్తీ కల్లు 90 శాతం వరకు అమ్ముడవుతోందని పోలీసులు, ఎక్సైజ్ విభాగం వారు చెబుతున్నారు.ఇక పిల్లలకు చెంచాడైనా కల్లు ఇవ్వరాదని తల్లిదండ్రులను హెచ్చరించాల్సిన అత్యవసరం ఉందని పేర్కొన్నారు. అస్వస్థతకు కల్లు కారణం కాదని కొట్టిపారేయడంతో పిల్లలు కల్లు కు బానిసకావడాన్ని డాక్టర్లు గుర్తించడం కష్టమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబం మొత్తం పిల్లలతోసహా కల్లు తాగడం ఒక సాధారణ సంప్రదాయంగా వర్ధిల్లుతోంది. పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు ఇద్దరూ బయటకు పనులమీద వెళ్లిపోయినప్పుడు పిల్లలను పడుకోబెట్టడానికి కల్లు తాగించడం పరిపాటిగా మారింది. అందువల్ల ఏడెనిమిదేళ్లు రాగానే ఆ పిల్లలు పూర్తిగా కల్తీ కల్లుకు బానిసై పోవడం జరుగుతోంది. ఫలితంగా వారి యువ దేహాలకు తీరని నష్టం జరుగుతోందని డాక్టర్లు పేర్కొన్నారు. పెద్దలకు భిన్నంగా బెంజోడయాజెపైన్స్ వంటి మత్తు పదార్థం కలిసిన కల్లు సేవించడంతో పిల్లల్లో వేగంగా మెదడు దెబ్బతింటోంది. మూర్ఛ వచ్చి ఊపిరి తీసుకోవడం కష్టమైతే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఎదురవుతుంది.అంతేకాదు ఎపిలెప్టికస్ స్థితి ఏర్పడితే అంటే దీర్ఘకాల మూర్ఛ సంభవించే పరిస్థితి కలిగితే ప్రాణాంతకమే అవుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. తాటిచెట్లనుంచి కల్లు తీసే గీతకార్మికులు ఒకప్పుడు తెలంగాణలో 8 లక్షల మంది వరకు ఉండేవారు.కానీ చెట్లపైనుంచి పడిపోయి ప్రాణాలు కోల్పోయే సంఘటనలు ఎక్కువ కావడంతో గీత కార్మికుల సంఖ్య ఇప్పుడు 1.9 లక్షలకు తగ్గిపోయింది. 2014 నుంచి 2024 మధ్యకాలంలో 5480 మంది గీత



కార్మికులు చెట్లపై నుంచి జారిపడిపోగా, వారిలో 775 మంది ప్రాణాలు కోల్పోయారు. 1974 మంది శాశ్వత వికలాంగులయ్యారు. 2731మంది గాయపడ్డారు. గత రెండేళ్ల లోనే 130 మంది ప్రాణాలు కోల్పోగా, 710 మంది గాయపడ్డారు. 120 మంది శాశ్వతంగా వికలాంగులయ్యారు. ఈ ప్రమాదాలకు సంబంధించి బాధితులకు రూ.12.96 కోట్లు నష్టపరిహారంగా చెల్లించవలసి వచ్చిందని కల్లు గీత కార్మిక సంఘం (టాడీ టాపర్స్ అసోసియేషన్) వెల్లడించింది. కల్లుగీత కార్మిక కుటుంబాలకు చెందిన ఇప్పటి యువతరం గీతకార్మిక వృత్తికి దూరంగా ఉంటున్నారు.చదువు పూర్తి కాగానే ప్రాణాలకు భద్రత కలిగించే వేతనాలు ఎక్కువగా లభించే వేరే ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో కల్లుగీత కార్మికులు కొందరు చెట్లపైనుంచి కల్లు తీయడం జరుగుతోంది. అయితే నగరాల్లో ఉండే కల్లు కాంపౌండ్ నిర్వాహకులు గ్రామీణ గీతకార్మికులకు బదులుగా స్వంత కార్మికులను ఏర్పాటు చేసుకుని కల్లును తీయిస్తున్నారు. జిల్లాల్లో ఎక్కడో దూరంగా ప్రభుత్వం కేటాయించిన చెట్లనుంచి కల్లు తీసి నగరాలకు తీసుకురావడం రవాణా ఛార్జీలు తడిసిమోపెడవుతుండంతో కొంతమంది కల్లు కాంపౌండ్ నిర్వాహకులు అడ్డదారులు తొక్కుతున్నారు. మత్తు రసాయనాలు కలిపిన కల్తీ కల్లును విక్రయించి లాభాలు పిండుకోవాలని చూస్తున్నారు. కొంతమంది అర్బన్ కల్లు కాంపౌండ్ వ్యాపారులు తాము బీహార్ నుంచి గీత కార్మికులను బాడుగ కింద రప్పించి కల్లు తీయిస్తున్నామని రికార్డుల్లో నమోదు చేస్తున్నా అవన్నీ బోగస్ వివరాలని బయటపడ్డాయి.కల్తీ కల్లు కల్లోలం ఇప్పుడు కొత్తేమీ కాదు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక విషాద సంఘటనలు జరగడంతో కల్లు కాంపౌండ్‌లను నిషేధించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత బిఆర్ఎస్ ప్రభుత్వం వల్ల కల్లు కాంపౌండ్‌లకు తిరిగి ప్రాణం వచ్చింది. నిపుణులు ఈ సమస్యకు పరిష్కారం ఎన్‌టిఆర్ ప్రభుత్వం అమలు చేసిన వారుణి వాహిని పథకాన్ని తిరిగి అమలు చేయడం మంచిదని సూచిస్తున్నారు. ఈ పథకంలో ప్రభుత్వమే ప్రతి జిల్లాలో ఫ్యాక్టరీలను నెలకొల్పి కల్లును సేకరించి ఎలాంటి మత్తు పదార్థాలు లేకుండా పండ్ల ఉత్పత్తులతో ప్రాసెస్ చేస్తుంది. ఎక్సైజ్ విభాగం కట్టుదిట్టమైన పర్యవేక్షణతో ఈ ప్రక్రియ సాగుతుంది.

# రెండో గవర్నర్ పదవిపై హామీ

న్యూఢిల్లీ,ఢిల్లీలో ఏపీ కేంద్రంగా కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్డీఏ బలోపేతంలో భాగంగా బీజేపీ అధినాయకత్వం వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా కీలక పదవుల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్ గా నియమించారు. ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ టూర్ సందర్భంగా జరిగిన చర్చల్లో టీడీపీకి మరో గవర్నర్ పదవితో పాటుగా కేంద్రంలోని కీలక నియామకాల్లోనూ అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ క్రమంలో టీడీపీ మరో సీనియర్ నేతకు గవర్నర్ పదవి ఖాయంగా కనిపిస్తోంది.బీజేపీ అధినాయకత్వం ఎన్డీఏ బలోపేతంలో భాగంగా భాగస్వామ్య పక్షాలకు ప్రాధాన్యత పెంచుతోంది. ఉత్తరాదిన బీజేపీ ఆధిపత్యానికి గండి పడుతుండటంతో దక్షిణాది రాష్ట్రాలపై ఫోకస్ పెడుతున్న కమలనాథులు ఆ రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇచ్చే పనిలో పడ్డారంట. త్వరలో బీహార్ .. ఆ తరువాత తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో కాషాయ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. టీడీపీకి కేంద్ర కేబినెట్ లో రెండు మంత్రి పదవులు దక్కాయి. తాజాగా టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్ గా నియమించారు. 2014-2018 మధ్య కాలంలో ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్న సమయంలో గవర్నర్ పదవిపైన హామీ దక్కింది కాని అమలు కాలేదు. ఈ సారి తొలి ఏడాది పూర్తవుతూనే అశోక్ గజపతికి గవర్నర్ పదవి కట్టబెట్టారు. కూటమిలో కీలకంగా ఉన్న టీడీపీకి మరింత ప్రాధాన్యత కల్పించాలని మరో గవర్నర్ పదవిపై హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.టీడీపీకి మరో గవర్నర్ పదవి దక్కితే చంద్రబాబు ఎవరికి అవకాశం కల్పిస్తారన్న చర్చ జరుగుతోంది. అశోక్ గజపతి రాజు కు అనేక సమీకరణాలు కలిసి వచ్చాయి. ఆయన పార్టీ ఆవి ర్భావం నుంచి ఉన్న నేత కావటంతో పాటు వివాద రహితుడు. ఆయన వర్గానికి చెందిన వారికి ప్రస్తుత కేబినెట్ లో అవకాశం దక్కలేదు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన నేతగా అశోక్ గజపతి రాజు గవర్నర్ గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక, బీసీ - ఎస్సీ వర్గాల నుంచి రెండో గవర్నర్ పదవి పైన చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పేరు సైతం ఈ రేసులో ప్రము ఖంగా వినిపిస్తున్నా ఆయనకు రాజ్యసభకు అవకాశం కల్పిస్తారంటున్నారు. యనమల సైతం రాజ్యసభకు వెల్లడానికి మొగ్గు చూపుతున్నారంట. ఆ క్రమంలో రెండో గవర్నర్ పదవి రాయలసీమ కు చెందిన బీసీ నేతకు ఇస్తారనే వాదన వినిపిస్తోంది. రాయలసీమ నుంచి చంద్రబాబుతో కలిసి కాంగ్రెస్ లో పని చేసి.. ఆ తరువాత టీడీపీలో అనేక కీలక పదవులు నిర్వహించిన కేఈ కృష్ణమూర్తి పేరు తెర మీదకు వచ్చినా ఆయన వయోభారం, ఆరోగ్య పరిస్థితి ప్రతికూలంగా మారాయంటున్నారు. ప్రస్తుతం కేఈ కుమారుడు పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ సారి గవర్నర్ పదవి బీసీ వర్గానికి ఇవ్వాలని చంద్రబాబు ఆలోచనగా చెబుతున్నారు. ఆ క్రమంలో గవర్నర్ పదవి దక్కించుకునే టీడీపీ సీనియర్ ఎవరన్నదానిపై పార్టీలో విస్తృత చర్చ మొదలైంది.

# సత్తా చాటుకునే నేతగా ప్రయత్నం

హైదరాబాద్,ఉచిత బస్సు వచ్చింది. రుణామాఫీ జరిగింది. కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లు మొదలయ్యాయి. బిసిల రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ తీసుకుని వస్తున్నారు. ఇలా ఒక్కో పథకాన్ని గట్టెక్కించేందుకు అధికార కాంగ్రెస్ బలాన్ని సమీకరించుకుంటోంది. ఇచ్చిన హామీల కోసం నానా తంటాలు పడుతోంది. ఎందుకంటే కెసిఆర్ పాలనలో లక్షల కోట్లు అప్పులు చేసి పెట్టిపోయారు. వాటి వడ్డీలు మోయలేని భారంగా మారాయి. వాటిని తీర్చుకుంటూనే ముందుకు సాగాలి. సకాలంలో జీతాలు ఇవ్వాలి. సకాలంలో పెన్షన్లు ఇవ్వాలి. ఇవన్నీ ఓ విషమ పరీక్షగానే చూడాలి. అయితే ఇవన్నీ కాంగ్రెస్‌కు ఎక్కడ మంచి పేరు తెచ్చి పెడతాయో..స్థానిక ఎన్నికల్లో తమకు పరాభవం తప్పదేమో అన్న భయం ఇప్పుడు బిఆర్ఎస్‌లో ఆవరించింది. అందుకే బిఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. చంద్రబాబుతో కుమ్మక్కయ్యారని అంటున్నారు. బనకచర్లతో తెలంగాణ వట్టిపోతుందని బాదుకుంటున్నారు. ఇలా రోజుకొక డ్రామాతో బిఆర్ఎస్ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారు. రుణమాఫీ పూర్తిగా చేయలేదని కొందరికే అందిందని, అందరికీ అమలు కాలేదని అంటున్నారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రకటించి పారిపోయారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం అసాధ్యమని, ఈ విషయంలో రేవంత్ రెడ్డి యూటర్న్ తీసుకుంటారని బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు బలంగా నమ్మారు. అందుకే రాజీనామా అంటూ డ్రామాలకు తెరలేపారు. ఎన్ని మార్గదర్శకాలు పెట్టి ఫిల్టర్ చేసినా సరే అమలు అసాధ్యమని అనుకున్నారు. ఎందుకంటే బీఆర్ఎస్ హయాంలో రూ. లక్ష రుణమాఫీ చేయడానికి కేసీఆర్ ఐదేళ్లు తంటాలు పడ్డారు. అయినా పూర్తిగా రుణమాఫీ చేయకుండానే ఎన్నికలకు వెళ్లారు. కేసీఆర్ వల్ల కానిది రేవంత్‌రెడ్డి వల్ల అవుతుందా అన్న లెక్కలు వేసుకున్నారు. ఇప్పుడు రుణమాఫీ అమలు చేయడంతో ఆ ఇద్దరు ఆందోళన చెందారు. అందుకే కొత్త రాగాలతో విమర్శలకు దిగుతున్నారు. మార్గదర్శకాలు సరిగా లేవని, అందరు రైతులకు అందలేదని, ఇంకా పలు కారణాలతో తమ సహజసిద్దమైన ధోరణిలో విమర్శలను సంధించారు. ఒక మంచిపని చేస్తుంటే అభినందించాలి. లోటుపాట్లు ఉంటే చర్చించాలి. సహేతుకమైన సలహాలు ఇవ్వాలి. కానీ విపక్షమంటే విమర్శించడం అన్న పద్దతిలో బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. అయినా రేవంత్ రెడ్డి మాత్రం.. రెండు లక్షల రుణమాఫీని ఆగస్టు పదిహేనో తేదీలోపు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు అమలు చేసారు. కుటుంబాన్ని యూనిట్ గా తీసుకున్నప్పటికీ.. ఆ కుటుంబాల ప్రాతిపదికగా రేషన్ కార్డులను జారీ చేస్తున్నారు. మెజార్టీ రైతుల్లో .. రైతు కుటుంబాల్లో రేవంత్ రెడ్డికి సానుకూలత పెరుగుతుందని చెప్పాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టు కునే దిశగా కీలక అడుగులు వేస్తున్నారు. ఆర్థిక పరమైన సమస్యను సులువుగానే అధిగమిస్తున్నారు. రుణమాఫీ చేయలేని బీఆర్ఎస్, బీజేపీ చెబుతూ వచ్చాయి. ఇప్పుడు అర్హుల్ని తగ్గించేశారని విమర్శలు గుప్పిస్తున్నారు. ధనవంతులకు రుణమాఫీ చేయకపోయినా వచ్చే వ్యతిరేకత ఏమీ ఉండదు. కానీ.. అర్హులైన వారికి అన్యాయం జరగనివ్వబోమని కాంగ్రెస్ సర్కార్ చెబుతోంది. మొత్తంగా అనేక సమస్యల మధ్య రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా రుణమాఫీ అమలుతో సమర్థత చాటుకున్నారు.అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని మంత్రివర్గం నిరంతరం కృషి చేస్తోంది.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్త అవసరం

ఏలూరు,సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని నివారించకపోతే ప్రజలు వ్యాధులబారిన పడాల్సి వస్తుందన్నారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్డీలు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై తగిన దృష్టి సారించాలన్నారు. అలాగే పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రైన్ల నిర్వహణపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడానికి పంచాయతీ అధికారులే కారణమన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖాధికారులు గుత్తేదారులతో పనులను చేయించాలన్నారు.

# నిమిష ప్రియ కేసులో అన్నీ ప్రశ్నలే!



యెమెన్‌లో కేరళ నర్సు నిమిషప్రియ ఉరిశిక్ష విషయంలో విన్నదే విని తల వాచిపోతోంది కానీ కేసు పూర్వాపరాలు నాకు తెలియటం లేదు. ఎన్ని గంటలు నెట్‌లో వెతికినా, పూర్తి రూపం రావటం లేదు. అందరూ కూడబలుక్కున్నట్లు ఒకే విషయాన్ని చెప్తున్నారు. అలా ఎలా? అని సందేహం వచ్చి అడిగితే తీర్చేవారెవరూ లేరు. ఎంతసేపూ మీడియా నిమిష కుటుంబీకులు, ఆమె లాయరు చెప్పినదే వల్లిస్తోంది తప్ప, కేసును లాజికల్‌గా మనకు ప్రెజెంటు చేయడం లేదు. అవతలివైపు వాళ్ల వాదనలేమిటి? కౌంటర్ ఆర్గ్యుమెంట్స్ ఏమిటి? ఏదీ తెలియటం లేదు. ఎటు చూసినా ఇండియన్ మీడియా వార్తలే కనబడుతున్నాయి. అవన్నీ చూశాక, నాకు తట్టిన సందేహాలను మీ ముందు వుంచుతున్నాను. మీకెవరికైనా సమాచారం తెలిసి, సందేహనివృత్తి చేయగలిగితే సంతోషిస్తాను.ఎందుకంటే మన మీడియా ఎంతసేపూ ఒకటే వాయిస్తోంది. మన ప్రభుత్వం ఆమెకు క్షమాభిక్ష పెట్టించడానికి ప్రయత్నిస్తోంది కానీ భారతదేశానికి, హౌతీల అధీనంలో వున్న ఉత్తర యెమెన్‌కు దౌత్యపరమైన సంబంధాలు లేవు కాబట్టి, అది వీలు పడటం లేదు. ఆమె పట్ల జాలితో, ఉరి శిక్ష తప్పించాలనే ఉద్దేశంతో క్లౌడ్ ఫండింగ్ చేసి మిలియన్ డాలర్లు పోగు చేసి, బ్లడ్ మనీగా ఆమె కుటుంబానికి యివ్వజూపారు. భారతదేశానికి చెందిన మతగురువు కుటుంబాన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు. ఉరిశిక్ష ప్రస్తుతానికి వాయిదా పడింది కానీ తలాల్ మెహదీ కుటుంబం బ్లడ్ మనీని నిరాకరించడంతో ఆ ప్రతిపాదన వీగిపోయింది. ఆమె ఏ రోజైనా ఉరికంబం ఎక్కవచ్చు.ఉరి శిక్ష వేయడం న్యాయమా కాదా? అనే చర్చలోకి మనం వెళ్లలేం. మన దేశంలోనూ అది రద్దు కాలేదు. ఏ దేశపు చట్టాలు దానికి వుంటాయి. అక్కడుండే న్యాయప్రక్రియ అక్కడుంటుంది. ఇస్లామిక్ దేశాల్లో చట్టాలు, శిక్షలు మరీ కఠినంగా వుంటాయి కాబట్టి అక్కడకు వెళ్లే విదేశీయులు మరింత జాగ్రత్తగా వుండాలి. బాధిత కుటుంబం దియా(బ్లడ్ మనీ) తీసుకుని హంతకుణ్ని క్షమిస్తే ఉరి తప్పే వెసులుబాటు ఆ దేశాల్లో వుంది కానీ మన దేశంలో లేదు. క్షమించాలా, లేక 'కిసాస్' (దైవన్యాయం లేదా కన్నుకు కన్ను సూత్రం)కు పట్టుబట్టాలా అనేది బాధిత కుటుంబం మాత్రమే నిర్ణయించాలి. మనం చెప్పలేం. ఎవరైనా తమ కుటుంబ సభ్యుణ్ని చంపి, ముక్కలు చేసి, వాటర్ ట్యాంకులో పడేసి, తర్వాత దేశం విడిచి పారిపోతూ పట్టుబడితే 'పోనీ లెండి' అనేయగలరా? ఎవరైనా అమ్మాయి రేప్‌కు గురైతే అమ్మాయి తల్లే కాదు, మన సమాజం కూడా 'ఆ కీచకుణ్ని బహిరంగంగా ఉరి వేయాలి' అని టీవీల్లో గర్జిస్తాం. ఏ విచారణా జరపకుండా పోలీసులు వాణ్ని టపటపా కాల్చేస్తే, చప్పట్లు కొడతాం. మనం శాంతంగా వుండమని యింకోళ్లకు ఎలా చెప్పగలం?ఈ కేసులో కెటామైన్ ఓవర్ డోస్ యివ్వడం తలాల్ చనిపోయాడని యీమె చెప్తోంది. ఆ ముక్క పోలీసులకు చెప్పి లొంగి పోయి వుంటే, 'ఎర్రర్ ఆఫ్ మెడికల్ జడ్జిమెంట్' అని కోర్టో, బాధిత కుటుంబమో అనుకుని క్షమ విషయంలో కాస్త ఊగిసలాడేదేమో! ఈమెకు కావలసినది పాస్‌పోర్టు, తలాల్ చచ్చిపోవడంతో అది చేతికి వచ్చే స్కోపు ఎలాగూ లేదు. 'మాదకద్రవ్యాలకు అలవాటు పడిన అతను మత్తు కోసం సెడటివ్ యిమ్మని తనే అడిగాడు. ఇస్తూంటే పొరపాటున డోస్ ఎక్కువైంది' అనే స్టాండ్ ఈమె తీసుకుని వుంటే, కావాలని చేసిందా? అనుకోకుండా చేసిందా? అనే చర్చకు తావుండేది. కానీ యీమె ఎవరికీ చెప్పకుండా అతి క్రూరంగా ముక్కలు ముక్కలు చేసేసి, వాటర్ ట్యాంకులో పడేయడం చూస్తే ఫ్యామిలీకి భగ్గుమనదా?ఏ మాటకా మాట యీమె కేసులో దీర్ఘమైన న్యాయప్రక్రియ జరిగింది. అసలా దేశాల్లో యింత ప్రొసీజర్ వుంటుందని నేననుకోలేదు. 'నీ జేబు కొట్టేశాడా? ఏ చేత్తో కొట్టేశాడు? కుడైతే కుడి చేయి నరికేస్తాం, ఎడమైతే ఎడమ చెయ్యి నరికేస్తాం' అంటారనుకున్నాను. పైన చెప్పిన రేప్ కేసుల్లో చూడండి, మన జనాలే ఊగిపోతారు %-% కోర్టూ, గీర్టూ అక్కరలేదు, తక్షణం ఉరేయ్యండి, కాల్చి పారేయండి అంటూ తక్షణ న్యాయం జరగాలని డిమాండ్ చేస్తారు. అలాటిది అక్కడ ఈమె 2017 జులైలో హత్య చేసి, ఆగస్టులో అరెస్టయితే 8 ఏళ్ల పాటు విచారణ, న్యాయ ప్రక్రియ జరిగిందంటే 'ఫర్వా లేదే' అనుకున్నాను. 2018లో విచారణ జరిగింది. కోర్టు ప్రొసీడింగ్స్ అర్థం కాలేదంటే, 2020లో ట్రయల్ కోర్టులో పునర్విచారణ జరిపి, మరణ శిక్ష వేసింది. అయినా ఐదేళ్ల పాటు అమలు కాలేదు. 2023 నవంబరులో సుప్రీం కోర్టు శిక్ష నిమిష అప్పీలు తిరస్కరించి శిక్ష ఖరారు చేసింది. దేశాధ్యక్షుడు 2024లో ఉరిని ఖరారు చేశాడు. 2025 జులై 16న ఉరి వేయబోయి, ఆగారు.'అబ్బే, అంతా హంబగ్. కోర్టులో విచారణంతా అరబిక్ భాషలో జరిగింది. ఈమెకు అరబిక్ రాదు మొర్రో అన్నా వినలేదు. ఈమెకు దుబాసీని పెట్టుకునే అవకాశం కూడా యివ్వలేదు. లాయర్ని యివ్వలేదు.' అని వార్తలు వచ్చేశాయి. ఆమెకు అరబిక్ రాకుండానే యెమెన్‌లో 2008 నుంచి 17 ఏళ్లగా వుంటోందా? దుబాయి లాటి దానిలో ఎక్కడ చూసినా ఇండియన్లు కనబడతారు కాబట్టి, స్థానిక భాష నేర్చుకోకుండా గెటాన్ కావచ్చేమో కానీ 2023 ప్రకారం 4 కోట్ల జనాభా వున్న యెమెన్‌లో ఇండియన్ల జనాభా 2011లో 3 వేలట. తర్వాత పెరిగి వుంటారు. 2014లో అంతర్యుద్ధం వచ్చినప్పుడు మన వాళ్లందరినీ వచ్చేయమని భారత్ అన్నప్పుడు 4 వేల మంది వచ్చేశారు. ఈమె లాటి వాళు యింకెంత మంది మిగిలి వుంటారు? వాళ్లలో మలయాళం ఎంతమందికి వస్తుంది? పైగా యీమె పని చేసేది ఏ మల్టీ నేషనల్ కంపెనీలోనో ఎగ్జిక్యూటివ్‌గా కాదు. నిత్యం రోగులు వచ్చే ఆసుపత్రిలో. వాళ్లు యీమె కోసం ఇంగ్లీషులో మాట్లాడరు కదా! అందువలన స్థానిక భాష నేర్చుకోక తప్పదు, నేర్చుకునే వుంటుంది.ఇంకో విషయం, యీమెతో పాటు సహనిందితురాలు యెమెన్ అమ్మాయే కదా. ముక్కలుగా నరికేయ్ అనే సలహాను మలయాళంలో చెప్పిందా? ఈమె కోసం ఇంగ్లీషు నేర్చుకుందా? సెడెటివ్ యిచ్చి పాస్‌పోర్టు లాక్కో అని జైలు వార్డెన్ సలహా యిచ్చాడట యీమెకు. అతనూ డిటోడిటో. ఆమెకు శుబ్బరంగా అరబిక్ మాట్లాడడం వచ్చే వుంటుంది %-% రాయడం, చదవడం రాకపోయినా! (దాని వలననే సమస్య వచ్చిందన్నారు. దాని సంగతి తర్వాత చెప్తా) ఇక కోర్టులో విషయానికి వస్తే, యీమె తలాల్‌పై కేసు పెట్టి, జైల్లోకి తోయించిందొకసారి. అప్పుడూ కోర్టులో విచారణ అరబిక్‌లోనే జరిగి వుంటుందిగా! ఈమె తరఫు లాయరు ఎవరో ఒకరు వాదించి వుంటారుగా! ఇప్పుడూ ఆ యెమెన్ అమ్మాయికి కూడా ముద్దాయేగా! కోర్టులో ఏ వాదనలు వినిపిస్తున్నారో ఆమె యీమెకు తర్జుమా చేసి చెప్తుందిగా! అందువలన భాషాసమస్య చేత న్యాయవిచారణలో నష్టపోయిందని అనడానికి లేదు.ఒకసారి విచారణ జరిగి 2018లో శిక్ష పడ్డాక ఆమె అరబిక్ అర్థం కాలేదని ప్లీడ్ చేసిందని, అప్పుడు మళ్లీ విచారణ చేపట్టారు. దానికి రెండేళ్లు పట్టింది. ఇదో టెక్నిక్. మనం ఖైదు చేసిన ఎల్‌టిటిఇ వాళ్ల విచారణ దశాబ్దాలు పట్టిందెందుకు? 'వేలాది పేజీల డాక్యుమెంట్లు ఇంగ్లీషులో వున్నాయి. అది మాకు అర్థం కాదు. తమిళంలో తర్జుమా చేసి యివ్వండి.' అని అడిగేవారు. ఏదీ, ఓ పక్క ఇంగ్లీషులో పరీక్షలు కట్టేస్తూ, డిగ్రీలు తెచ్చేసుకుంటూ! అలా కాలయాపన చేసి, చివర్లో యింతకాలం క్షోభ అనుభవించాం కాబట్టి ఉరిశిక్ష రద్దు చేయండి అని అభ్యర్థించారు. జయలలిత అక్రమాస్తుల కేసులో శశికళ కూడా అంతే. అన్నీ తమిళంలో మార్చి యివ్వాలంటూ చాలాకాలం జైలు బయటే వుండిపోయింది.అయ్యో పాపం భుక్తికై యీమె యెమెన్ వెళ్లి 'గోట్ లైఫ్' హీరోలా అష్టకష్టాలు పడింది అనుకునే వాళ్లు కొన్ని విషయాలు గమనించాలి. ఈమె క్వాలిఫైడ్ నర్స్ కాదు. టెన్త్ క్లాసు కూడా పాసవ్వలేదు కాబట్టి, ఇండియాలో నర్సు ఉద్యోగం రాలేదు. టెన్త్ పాసవ్వకుండానే చర్చి వాళ్లిచ్చిన ధనసహాయంతో నర్స్ కోర్సు చేసిందట. ఇండియాలో నర్సు ట్రైనింగ్‌కు మినిమమ్ క్వాలిఫికేషన్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీలతో ఇంటర్ పాసవ్వాలని గూగుల్ చెప్తోంది. మరి క్వాలిఫికేషన్ లేని వాళ్లను చర్చి ఎలా చదివిస్తోంది? మనం వెళ్లే ఆసుపత్రుల్లో యిలాటి అన్‌క్వాలిఫైడ్ వాళ్లు ఎంతమంది ఉన్నారో అన్న భయం వేసింది. ఈమె 1989లో పాలక్కాడు జిల్లాలో పుట్టింది. తల్లి పనిమనిషిగా పని చేస్తుంది. తండ్రి గురించి వార్తల్లో రాలేదు. చర్చి దయతో నర్సు కోర్సు పూర్తయింది. ఇక్కడ నర్సు కాలేదు కాబట్టి, 2008లో తన 19వ ఏట యెమెన్‌కు పయనమైంది.ఏ దుబాయో వెళ్లకుండా యెమెన్‌కు ఎందుకు? గల్ఫ్‌లో డాక్యుమెంట్లు గట్టిగా చూస్తారా? ఇవాళే చదివాను. సౌదీ అరేబియాలో 30 ఏళ్ల క్రితం పని చేసి వచ్చేసిన తెలుగాయన ఇంజనీరింగు సర్టిఫికెట్టుపై అనుమానం వచ్చి హజ్‌కి వెళితే పట్టుకున్నారట. యెమెన్‌లో చెకింగ్ వుండదేమో! లేకపోతే అలాటి భీకరమైన ప్రదేశానికి, సముద్రపు దొంగలు విచ్చలవిడిగా రాజ్యమేలే చోటికి ఏరికోరి ఎవరెళతారు? అక్కడికి వెళ్లి నేను నర్సుని అని చెప్పేసుకుంది. సరే కానీ అని ఒకాయన తన ఆసుపత్రిలో చేర్చుకున్నాడు. అది ప్రభుత్వాసుపత్రి అని కొందరు రాస్తున్నారు. కాదు, ప్రయివేటు ఆసుపత్రి అని కొందరు రాశారు. మొదట ప్రభుత్వాసుపత్రిలో చేరి, తర్వాత ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిందేమో తెలియదు.ఆరేళ్లు పని చేశాక పెద్దగా సంపాదించినది ఏమీ లేదని సొంతంగా ఆసుపత్రి పెట్టబోయిందని కొందరన్నారు. సంపాదించి పెట్టిందంటే అదో దారి. ఈమెకు 2011లో 22వ ఏట పెళ్లయింది. భర్త పరిస్థితి కూడా అంతంత మాత్రమే. అతనూ యెమెన్ వచ్చి ఎలక్ట్రీషియన్ దగ్గర అసిస్టెంటుగా పని చేసి, కిట్టుబాటు కాక, కేరళ వెళ్లిపోదామనుకున్నాడు. వాళ్లకు 2012 డిసెంబరులో కూతురు పుట్టింది. యెమెన్‌లో 2014 ఉత్తరార్థంలో అంతర్యుద్ధం వచ్చింది. అందరూ వెనక్కి వచ్చేయండి అంటూ మన కేంద్ర ప్రభుత్వం రప్పించేస్తూ వుంటే, యీమె మాత్రం అక్కడే వుండిపోయింది. ఏ ధీమాతో? అదీ భర్తనూ, రెండేళ్ల కూతుర్ని ఇండియా పంపించేసి, తనొక్కత్తే అక్కడ వ్యాపారం చేయడానికి సమకట్టిందంటే వింతగా లేదూ! భర్త కేరళకు తిరిగి వచ్చి ఆటో నడుపుకుంటున్నాడు. వ్యాపారం చేయడానికి యీమె, భర్త కలిసి రూ. 50 లక్షలు పెట్టుబడి పెట్టారని చెప్తున్నారు. అంత డబ్బు పోగు చేయగలిగితే భర్త ఆటో డ్రైవరుగా ఎందుకుంటాడు? నిజంగా పోగు చేస్తే, యిక్కడే ఇండియా లోనే ఏ నైటింగేల్ సర్వీసో పెట్టుకోవచ్చుగా! నర్సులకు ఎప్పుడూ డిమాండు వుంటుంది.ఇలాటి ఆమె దాదాపు శత్రుదేశమైన యెమెన్‌లో పెట్టుబడి పెట్టి వ్యాపారంలోకి దిగిందంటే ఆశ్చర్యంగా వుంది. యెమెన్‌లో వ్యాపారం పెట్టాలంటే స్థానికుణ్ని భాగస్వామిగా తీసుకోవాలనే రూలు వుంది అన్నదానిలో చిన్న మినహాయింపు వుంది. లిమిటెడ్ కంపెనీ పెడితే వాళ్ల భాగస్వామ్యం అక్కరలేదు. పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్ పెడితేనే కావాలి. భాగస్వామిగా ఎవర్ని పెట్టుకుంది? తలాల్‌ను. అతను తన భార్య పురుటికై యీ ఆస్పత్రికి వచ్చాడని, అప్పుడు యీమె పరిచయం అయిందని ఓ చోట చదివాను. అసలతనికి పెళ్లయిందో లేదో, పిల్లలున్నారో లేదో, వయసెంతో ఏ వివరాలు మనవాళ్లు స్పష్టంగా యివ్వటం లేదు. కారులో ఉన్న ఒకే ఒక్క ఫోటో వుంది. బ్లడ్ మనీకి కుటుంబం నిరాకరించింది అన్నప్పుడు కూడా తమ్ముడు అబ్దుల్ ఫతా పేరు తప్ప వేరెవరి పేరూ బయటకు రాలేదు. తలాల్‌కు టెక్స్‌టైల్ వ్యాపారం వుంది. అందువలన అతనే మేజర్ పార్ట్‌నర్ అనుకోవాలి.అసలు యీమెకు భాగస్వామ్యం వుందా లేదా అన్నది కూడా అనుమానమే.

## కౌలు రైతులపై వివక్ష

ఏలూరు, వ్యవసాయం గిట్టుబాటుకాక, ప్రైవేటు అప్పులతో రుణగ్రస్తులై విధిలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న కౌల్దార్లను అసలు రైతులుగానే గుర్తించట్లేదు. పంటల ఉత్పత్తిలో, ఏపీలో 16 లక్షల మంది కౌలు రైతులుంటారని ప్రభుత్వమే లెక్కలేసింది. 20 లక్షలకు పైమాటేనని రైతుసంఘాలు చెబుతున్నాయి. కౌలు రైతులకు సంస్థాగత పరపతి కల్పించే విషయంలో ప్రభుత్వాల వైఫల్యం ఆనవాయితీగా వస్తుండగా కౌలు రైతులకు బ్యాంక్ రుణాలని ప్రతి ఏటా చెబుతున్నా అమలు కావడం లేదన్నారు. వ్యవసాయంలో మార్కెట్ శక్తుల ఆధిపత్యం పెరగడం, భూసంస్కరణలు జరగకపోవడం వలన ఏపీలో కౌలు రైతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అంచనా వేసిన మేరకైనా సర్కారు కౌలు రైతులను గుర్తించి బ్యాంకు రుణాలిప్పించిందా అంటే అదీ లేదు. కౌలు రైతులు తమ హక్కుల కోసం దశాబ్దాల తరబడి పోరాడుతున్నారు. తమకు కనీసం సంస్థాగత పరపతి, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరుతున్నారు. ప్రభుత్వాల చిన్నచూపునకు బ్యాంకుల సహాయ నిరాకరణ తోడవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం కౌలు రైతులు పడుతున్న అగచాట్లు పడుతున్నారని కౌలురైతుల సంఘం నాయకుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు తీసుకుని వచ్చినా తమకు అండగా ఉండడం లేదన్నారు. రైతుల స్థితిగతులపై అధ్యయనం చేసిన జయతిఘోష్, కోనేరు రంగారావు కమిటీలు కౌల్దార్లకు బ్యాంక్ రుణాలిప్పించాలని సిఫారసు చేసినా పెద్దగా ఫలితం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కౌల్దార్లకు రుణ అర్హత కార్డు జారీకి చట్టం తెచ్చింది. భూయజమానితో సంబంధం లేకుండా రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. నేటికీ గ్రామాల్లో భూస్వాములు, పెత్తందార్ల ఆధిపత్యం కొనసాగుతున్నందున కౌల్దార్లుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదలకు కార్డులు రావట్లేదన్నారు. బ్యాంకులు కౌలు రైతుల రుణాలే ఎన్‌పిఏలుగా పేర్కొంటే ప్రభుత్వం కూడా దానిని అంగీకరించడం సరికాదని శ్రీనివాస్ అన్నారు. రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెట్టింది. వడ్డీ మాఫీ, వడ్డీ రాయితీ పథకాల గురించి చెప్పనవసరం లేదు. ఎల్‌ఇసి లేని వారికి సాగు ధృవీకరణ పత్రాలన్నా పెద్దగా ఉపయోగం లేదు.

## భూముల కుంభకోణంలో లాలూకు చుక్కెదురు

న్యూఢిల్లీ,భూములకు ఉద్యోగాల కుంభకోణం లో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కు చుక్కెదురైంది. ఈ కేసులో ట్రయల్ కోర్టు విచారణను నిలిపివేసేలా ఢిల్లీ హైకోర్టుకు ఆదేశాలివ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఈ కేసు విచారణ యథాతథంగా కొనసాగ నుంది. ఇండియన్ రైల్వేస్ వెస్ట్ సెంట్రల్ జోన్ జబల్‌పూర్‌లో గ్రూప్-డి నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన కేసు ఇది. 2004-2009 మధ్య లాలూ ప్రసాద్ రైల్వేశాఖ మంత్రిగా ఉన్నారు. ఉద్యోగాలకు ప్రతిగా అభ్యర్థులు లాలూ కుటుంబసభ్యులు, సన్నిహితులకు భూములు బదలాయించారని ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీల ఆరోపణగా ఉంది. ఈ క్రమంలో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాల్సిందిగా లాలూ ప్రసాద్ అత్యున్నత

# భేతాళ కథల్లా బిఆర్ఎస్ అవినీతి!




హైదరాబాద్,కాళేశ్వరంపై కట్టుకథలు...ఫోన్ ట్యాపింగ్‌పై పిట్టకథలు...కారు రేసింగ్‌పై దబాయింపులు..అప్పులపై కాలర్ ఎగవేతలు...ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అవినీతి కథలు భేతాళ కథల్లా తోసుకుని వస్తున్నాయి. కెసిఆర్ కుటుంబ పాలనలో జరగని అవినీతి లేదు. వారి బాగోతం అంతాఇంతా కాదు. అవన్నీ పక్కన పెట్టి మళ్లీ అధికారంలోకి రావడమెలా అన్నదే ఇప్పుడు వారు వేసుకున్న స్కెచ్. ప్రజలను మరోమారు బురిడీ కొట్టించాలి. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించాలి. ఈ పద్ధతిలో బిఆర్ఎస్ రాజకీయాలు నడుస్తున్నాయి. పదేళ్లపాటు రాష్ట్రాన్ని అడ్డదిడ్డంగా పాలించి, అక్రమాలకు పాల్పడి, అవినీతిని మూటకట్టుకుని, అక్రమంగా వేలకోట్లు సంపాదించి...రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్ కుటుంబం ఇప్పుడు కాంగ్రెస్‌ను ఎలా పడగొట్టాలా అన్న ఆలోచనలో పడింది. రేవంత్‌ను విమర్శించడం, కాంగ్రెస్‌ను విమర్శించడంపనిగా పెట్టుకున్నారు. గంట్‌ఓ అంశంతో తెరపైకి వస్తున్నారు. ఓ వైపు కెటిఆర్, మరోవైపు హరీష్ రావు..మధ్యలో కొందరు అప్పుడప్పుడూ వస్తుంటారు. వీరికంతా ఒకటే...విమర్శలతో ప్రభుత్వాన్ని బద్నాం చేయాలి. అర్జంటుగా గద్దెనెక్కాలి అన్న యావ. మరీముఖ్యంగా కెటిఆర్ ఈ విషయంలో చాలా తొందరగా ఉన్నారు. అందుకే మళ్లీ తమదే రాజ్యం అని విర్రవీగుతున్నారు. అవినీతిలో మునిగి తేలిని వారికి అధికారలేమి ఉక్కపోతగా మారింది. దీనిని భరించలేక పోతున్నారు. 18 నెలలు దాటడంతో ఇంకెంతకాలం అన్న రీతిలో అపసోపాలు పడుతున్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై అదేపనిగా విమర్శలు ఎక్కుపెడుతోంది. కాంగ్రెస్ అవినీతి చేస్తే విమర్శించాల్సిందే. కానీ అవినీతిపరులు కాదు. తమ అవినీతి బయట పడకుండా, తమ అక్రమాలు ప్రజలు గుర్తించకుండా ఎదురుదాడి మార్గాన్ని బిఆర్ఎస్ నేతలు ఎంచుకున్నారు. హరీష్‌రావు, కెటిఆర్, నిరంజన్ రెడ్డి, జగదీశ్ రెడ్డిలు ఇందులో ప్రధాన భాగస్వాములుగా రోజూ విమర్శలు తప్ప మరో పనిలేకుండా సాగుతున్నారు. నవ్విపోదురు గాక నాకేంటి అన్న చందంగా పదేపదే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విమర్శలు చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. విచారణలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వాటికి సమాధానం చెప్పే ధైర్యం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతిని వెలుగులోకి తీసుకొస్తూనే ఉంది. రైతుబంధు కింద గుట్టలకు, వెంచర్లకు, హైవేలకు నగదును అందజేసిన ఘనత నాటి కెసిఆర్ ప్రభుత్వానిది. రైతుభరోసా కింద ఇప్పుడు అర్హులకే సాయాం అందించాలని సర్కార్ నిర్ణయించి అమలు చేస్తోంది. ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అర్హులైన రైతులకే సాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా ఏదైనా పొరపాటు ఉందా లేదా అన్నది కూడా చూడకుండా భూతద్దం పెట్టి వెతికే పనిలో పడ్డారు. అప్పుడే బ్రహ్మాండం బద్దలు అయినట్లు.. తామంతా బంగారం తాపడం చేస్తే.. కాంగ్రెస్ వాళ్లు కరగనాకినట్లుగా గగ్గోలు పెడుతున్నారు. ప్రజలు వీరికి సిగ్గులేదా అని ఈసడించుకుంటున్న విషయాన్ని గమనించడం లేదు. అధికారమత్తులో పడ్డవారికి ప్రజల ఈజడింపులు కనిపించడం లేదు. ఉతికి ఆరేసినట్లు ఓడించినా బుద్ధి తెచ్చుకోవడం లేదు. కొందరు ఎమ్మెల్యేలు జారుకున్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతలు పెట్టారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ఇంకా ఎలాంటి వాతలు పెడితే మార్పు వస్తుందో ప్రజలు గుర్తించి, ఆపని చేయాల్సి ఉంది. దాదాపు ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతికి పాల్పడ్డారు. అవినీతిపై విచరాణ జరక్కుండా కోర్టులకు ఎక్కారు. విచారణ జరపరాదని కోరుకున్నారు. విద్యుత్ ఒప్పందాలపై అవినీతి జరక్కుంటే ..కెసిఆర్ మహాశయుడు ఎందుకు విచారణ ఆపమన్నారో చెప్పడం లేదు. అవినీతి లేకుంటే బాజాప్తా కమిషన్ ముందు తన వాదన వినిపించ వచ్చు. కాళేశ్వరం అవినీతిలో ఇప్పటికే ఇంజనీర్లు పట్టుబడ్డారు. వారే వేలకోట్లు పోగేస్తే..ఇక అసలునాయకులు ఎంత బొక్కారో ప్రజలు గమనించాలి. ప్రజలు కేవలం కెసిఆర్ కుటుంబ అహంకారంతో విసిగిపోయి కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇక్కడ కాంగ్రెస్‌తో ప్రేమతో పట్టం కట్టలేదని గుర్తించాలి. ముందుగా అర్జంటుగా బిఆర్ఎస్‌ను సాగనంపే ప్రక్రియలో కాంగ్రెస్‌కు ఓటేశారు. ఈ విషయం తెలియకుండా ప్రజలు పొరపాటు కాంగ్రెస్‌కు ఓటేశారని ప్రజలను కూడా తప్పుపడుతున్నారు. నిజానికి కాంగ్రెస్ వారు అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం ఏడున్నల లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. ప్రతిపక్ష పార్టీల విమర్శలకు చెక్ పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంట్ బిల్లును ఉచితంగా అమలు చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌కు రూ.500లను కూడా అమలు చేస్తూ పేద ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. కానీ బిఆర్ఎస్ నేతలు ఆరింట ఒక్కటే అమలవుతోందని గుడ్డిగా విమర్శలు చేసి నవ్వులపాలు అవుతున్నారు. ఇక అన్నింటిని మించిన రైతు రుణమాఫీకి కూడా శ్రీకారం చుట్టింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 'రైతు రుణమాఫీ' అమలుకు శ్రీకారం చుట్టారు. ఏకకాలంలో రుణమాఫీ చేసి చూపారు. 2014 ఎన్నికల్లో తెలంగాణలోని రైతులందరికి లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని కేసీఆర్ చెప్పారు.

## గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో...

అమరావతి,గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యం పెరిగిందని, విద్యుత్ తయారీ సంస్థలు ఈ విషయంపై పరిశోధనలు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఏపీ ఇలాంటి పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలని చంద్రబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ హైడ్రోజన్ కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది.. 500 గిగావాట్ల హరిత విద్యుత్ తయారీ చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యంగా నిర్దేశిరచుకున్నారు.. నీతి అయోగ్ కూడా దీనిపై దృష్టి సారించింది.. ఎనర్జీ తయారీకి ఖర్చును ఎలా తగ్గించాలి అని ఆలోచిస్తున్నాం అని అన్నారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు- చేసిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో సీఎం పాల్గొని ఎనర్జీ కంపెనీల ఎండీ, సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మీ ఆలోచనలు వినడానికి, ఆవిష్కరణలు తెలుసుకోవడానికే ఇక్కడకు వచ్చాను. విద్యుత్ సంస్కరణలు మొదట ప్రారంభించింది నేనే. సంస్కరణలు అమలు చేసిన కారణంగా అప్పట్లో అధికారం కోల్పోయాం. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజీపై దృష్టి సారించాలి. ఏపీ ఇలాంటి పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలని అభిలషించారు. విద్యుత్ సంస్కరణలు దేశంలో తొలిసారి ప్రారంభించింది నేనే.. సంస్కరణలు అమలు చేసిన కారణంగా నేను అప్పట్లో అధికారం కోల్పోయాను.. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజీపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. రెండు రోజులు పాటు మీరు ఇక్కడ ఉంటారు.. మన ప్రధాని కూడా 500 గిగావాట్ తో డౌన్ స్ట్రీమ్ ఇండస్ట్రీగ్రా గ్రీన్ ఎనర్జీపై కృషి చేస్తున్నారు.. ఏపీ హైడ్రోజన్ వ్యాలీగా మారాలని నిర్ణయించాం.. దానికి అవసరం అయినా టెక్నాలజీ మీరు తీసుకురావాలని సూచించారు. మీ అందరికి బెస్ట్ ప్లేస్ ఏపీలో ఉంది.. కాబట్టి మీరు అందరు ముందుకు రావాలని చంద్రబాబు కోరారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యం పెరిగిందని, విద్యుత్ తయారీ సంస్థలు దీనిపై పరిశోధనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్ కూడా పాల్గొన్నారు.

## ఫైర్ బ్రాండ్ కు బాధ్యతలు..!!

హైదరాబాద్,తెలంగాణ పైన బీజేపీ నాయకత్వం స్పెషల్ ఫోకస్ చేసింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణా మాలను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తోంది. అందులోనూ గ్రేటర్ పరిధిలో పట్టు పెంచుకునేందుకు కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. రాష్ట్ర పార్టీ కొత్త అధ్యక్షుడి నియామకం తరువాత గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటోంది. రాజాసింగ్ రాజీనామా ఆమోదించి న పార్టీ నాయకత్వం.. ఇప్పుడు ఆయన ఎమ్మెల్యే పదవి పైన అనర్హత వేటు కోసం స్పీకర్ కు లేఖ రాయాలని నిర్ణయించింది. రాజాసింగ్ స్థానంలో పార్టీ ఫైర్ బ్రాండ్ ను రంగంలోకి దించుతోంది.

కీలక నిర్ణయం

గ్రేటర్ హైదరాబాద్ గత ఎన్నికల్లో అనూహ్యంగా బలం పెంచుకున్న బీజేపీ.. ఇప్పుడు రానున్న ఎన్నికల కోసం సిద్ధం అవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం వ్యూహాలకు ధీటుగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల తరువాత పూర్తిగా గ్రేటర్ పైన ఫోకస్ పెట్టాలని ఆదేశించింది. ఇదే సమయంలో నగరంలో పార్టీకి కీలకంగా వ్యవహరించిన రాజాసింగ్ రాజీనామాను పార్టీ ఆమోదించింది. పార్టీ సింబల్ పైన గెలిచిన రాజాసింగ్ పైన అనర్హత వేటు వేయాలని స్పీకర్ కు లేఖ రాసేందుకు పార్టీ నిర్ణయించినట్లు సమా చారం. స్పీకర్ ఆమోదిస్తే జూబ్లీహిల్స్ తో పాటుగా గోషా మహల్ కు ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది. దీంతో..గోషా మహల్ స్థానంలో బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది.

రాజాసింగ్ స్థానంలో

రాజాసింగ్ పార్టీని వీడటంతో.. ఆయన స్థానంలో మరో నేత కు గోషామహల్ బాధ్యతలు అప్పగించా లని పార్టీ నిర్ణయించింది. 2024 ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పార్టీ ఏరి కోరి ఎంపీ అభ్యర్ధిగా ఖరారు చేసి ఎంఐఎం అధినేత అసద్ పై పోటీకి దింపిన మాధవీ లతకు గోషామహల్ బాధ్యతలు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. గోషామహల్ లో పార్టీ పట్టు జారకుండా మాధవీ లత వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గోషామహల్ నుంచి బీజేపీ అభ్యర్ధిగా రాజాసింగ్ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ఆయన ఎమ్మెల్యే పదవి పైన పార్టీ కోరుకుంటున్నట్లుగా అనర్హత వేటు పడితే బీజేపీ అభ్యర్ధిగా మాధవీ లత ను బరిలోకి దింపాలని డిసైడ్ అయ్యారు. అందు కోసం ఇప్పటి నుంచే నియోజకవర్గంలో మాధవీ లతకు బాధ్యతలు కేటాయిస్తున్నారు.

ఎంపిక వెనుక

మాధవీ లతను 2024 ఎన్నికల సమయంలో బీజేపీ నాయకత్వం ఏరి కోరి ఎంపిక చేసింది. విరించి ఆస్పత్రుల చైర్ పర్సన్ గా ఉన్న కొంపెల్లి మాధవీ లత హిందూ ధార్మిక కార్యక్రమాలతో పాటుగా క్లాసికల్ మ్యూజికల్ సింగర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈమె లతామా ఫౌండేషన్ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.హిందుత్వం, భారతీయ సంస్కృతిపై అనర్గళంగా మాట్లాడగలరు. పాత బస్తీలో ఎవరికెలాంటి సమస్య వచ్చినా అందుబాటు లో ఉండేవారు. మాధవీ లతను ఎంఐఎం అధినేత అసద్ పైన బీజేపీ అభ్యర్ధిగా పార్టీ బరిలోకి దించింది. ఆ ఎన్నికల్లో మాధవీ లతకు 323,894 ఓట్లు వచ్చాయి. గతం కంటే బీజేపీకి ఓట్లు పెరిగాయి. ఇక, ఇప్పుడు గోషామహల్ బాధ్యతలు మాధవీ లతకు ఇవ్వటం.. రాజాసింగ్ ప్రచారం లో ఉన్నట్లుగా శివసేనలో చేరితే పోటీ ఆసక్తి కరంగా మారటం ఖాయంగా కనిపిస్తోంది.

## ఛత్తీస్‌ఘడ్ మద్యం కుంభకోణం కేసు

రాయ్‌పుర్,ఛత్తీస్‌గఢ్‌లో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ఇడి దూకుడు పెంచింది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ గట్టి షాకిచ్చింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన కుమారుడు చైతన్య బఘేల్‌ను ఈడీ శుక్రవారం అరెస్టు చేసింది. ఉదయం బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు.. అనంతరం చైతన్యను కస్టడీలోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం తో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో చైతన్య బఘేల్ పాత్ర ఉందని అభియోగాలు వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన ఈడీ.. మద్యం సిండికేట్‌కు రూ.రెండు వేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు సంస్థ.. శుక్రవారం మరోసారి తనిఖీలు చేపట్టింది. ఈ ఉదయం దుర్గ్ జిల్లాలోని భిలాయ్ ప్రాంతంలో గల బఘేల్ నివాసానికి ఈడీ అధికారులు చేరుకున్నారు. కేసుకు సంబంధించి కొత్త ఆధారాలు లభించడంతో మాజీ సీఎం నివాసంలో సోదాలు చేపట్టారు. అయితే, ఈ సమయంలో చైతన్య బఘేల్ అధికారులకు సహకరించకపోవడంతో ఆయనను అరెస్టు చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నుంచి బఘేల్ నివాసం వద్ద పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది మోహరించారు. పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకొని ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా.. పుట్టిన రోజు నాడే చైతన్యను ఈడీ అధికారులు అరెస్టు చేయడం గమనార్హం. దీనిపై ఆయన తండ్రి భూపేశ్ స్పందించారు.

# తప్పులను కప్పి పుచ్చుకునేందుకే విమర్శలు




విశాఖపట్నం, గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, పోలవరం, నీటిపారుదల ప్రాజెక్టుల అంశంలో తప్పిదాలపై ప్రజల దృష్టి మరల్చడానికి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని మంత్రి పార్థసారథి విమర్శించారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. అబద్ధాలే పునాదిగా చేసుకొని పబ్బం గడుపుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. కేవలం రాజకీయలబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని ఆయన విమర్శించారు.తమిళనాడులో పార్టీలు రాజకీయంగా విభేదించినా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తాయని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఇక్కడ మాత్రం స్వార్థ పూరిత ప్రతిపక్ష ఉండటం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. గత టీ-డీపీ ప్రభుత్వ హయాంలో 70 శాతం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసినా.. గత జగన్ సర్కారు ప్రాజెక్ట్ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు.జగన్.. ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడు.. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు.. అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి.. ఆ ప్రయోజనాలు రైతన్నలు పొందేలా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. వైఎస్ జగన్ బాధ్యత గల రాజకీయ నాయకుడిగా పనిచేయాలని ఆయన హితవు పలికారు. రఫ్ఫా.. రఫ్ఫా నరికేస్తు.. పొడి చేస్తాం అంటు-న్నారు.. పోలీసులు సక్రమంగా పనిచేయకూడదని, విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నారు, పోలీసులుపై కించపరిచేలా మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. జగన్.. మీడియాను టిష్యూ పేపర్తో పోల్చారంటే.. మీడియాపై ఆయనకి ఎలాంటి గౌరవం ఉందో చూడండని మంత్రి అన్నారు. జగన్ కి ఏ వ్యవస్థ మీద గౌరవం లేదు.. ఈ రాష్ట్రానికి నిధులు, పెట్టు-బడుదారులు ఎవరూ రాకూడదని ఇలా చేస్తున్నారని మంత్రి చెప్పారు. ఈ విద్వేషాల్ని ప్రజలు గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి చెప్పుకొచ్చారు.

# కేంద్రమంత్రిగా నాగబాబు? టీడీపీ నుంచి ఎవరు?

అమరావతి,వర్షాకాల సమావేశాల తర్వాత కేంద్ర మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంటున్నారు. నాగబాబుకు కేంద్రమంత్రి పదవి ఇవ్వాలనుకుంటే..ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోపు రాజ్యసభకు పంపాల్సి ఉంటుంది.మెగా బ్రదర్..జనసేన ఎమ్మెల్సీ నాగబాబు అమాత్య యోగంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు..అంతా అనుకున్నట్లు జరిగితే ఇప్పటికే నాగబాబు రాష్ట్ర మంత్రి వర్గంలో ఉండాల్సింది. అయితే ఉన్న ఒకే ఒక బెర్త్ కోసం మార్పులు చేయడం ఎందుకని..క్యాబినెట్ మార్పులు, చేర్పులు ఉంటాయని..అప్పుడు నాగబాబును తీసుకుంటారని ఎప్పటికప్పుడు కొత్త కొత్త న్యూస్ బయటికొస్తోంది. దాంతో నాగబాబుకు అమాత్య యోగం దక్కడం ఆలస్యమవుతోంది.లేటెస్ట్ న్యూస్ ప్రకారం నాగబాబును కేంద్రమంత్రివర్గంలోకి తీసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది. త్వరలో సెంట్రల్ క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్ చేస్తారని అంటున్నారు. విస్తరణలో ఏపీకి ఇంకో రెండు బెర్తులు దక్కే అవకాశం ఉందట. అందులో ఒకటి జనసేనకు ఫిక్స్ చేయగా..నాగబాబు ఆ కోటాలో కేంద్ర మంత్రివర్గంలోకి వెళ్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరో బెర్త్ టీడీపీకి ఇస్తారని చెబుతున్నారు. రాయలసీమకు చెందిన టీడీపీ ఎంపీలైనా ఓ ఎస్సీ, మరో బీసీ నేతల్లో ఇద్దరిలో ఒకరికి ఛాన్స్ పక్కా అని తెలుగు తమ్ముళ్లు గుసగుసలు పెట్టుకుంటున్నారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ టూర్‌లో ఈ అంశంపై క్లారిటీ వచ్చినట్లు పొలిటికల్ గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయ్.సోదరుడు నాగబాబుని రాష్ట్రంలో కంటే కేంద్రమంత్రిగా చేస్తే పదవుల విషయంలో సమీకరణలు చక్కగా సరిపోతాయని పవన్ భావిస్తున్నారట. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు రాష్ట్రమంత్రి వర్గంలో ఉన్నారన్న విమర్శలకు తావు ఇవ్వకుండా పవన్ ఈ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్లమెంట్‌లో జనసేనకు ఇద్దరు సభ్యుల బలం ఉంది. మచిలీపట్నం నుంచి బాలశౌరి, కాకినాడ నుంచి ఉదయ్ శ్రీనివాస్ ఎంపీగా ఉన్నారు. అయితే ఇప్పుడు నాగబాబు కేంద్రమంత్రి కావాలంటే ఎమ్మెల్సీకి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. అలా అయితే 2026 వరకు ఏపీలో రాజ్యసభ సీట్లు ఖాళీ అయ్యే అవకాశం లేదు.ఈలోపే నాగబాబును రాజ్యసభకు పంపాలంటే బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి అవకాశం కల్పించొచ్చు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ అలా ఏమైనా నిర్ణయం తీసుకుంటుందా అనేది వేచి చూడాలి. అయితే గతంలోనే జనసేనకు కేంద్ర సహాయ మంత్రి పదవిని ఆఫర్ చేశారట ప్రధాని మోదీ. అప్పుడు సుముఖత వ్యక్తం చేయని పవన్ ఇప్పుడు తన సోదరుడు నాగబాబును కేంద్ర మంత్రిని చేయాలని డిసైడ్ అయ్యారని అంటున్నారు. అయితే ఇప్పటికే స్టేట్ క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఒక బెర్త్ కోసం బీజేపీ పట్టుబడుతోందట. నాగబాబుకు ఇవ్వాలనుకున్న ఆ



అమాత్య పదవిని బీజేపీకి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇక టీడీపీ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎంపీలో కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు.

### ప్రాంతీయ సమీకరణలు?

బీసీ కోటాలో కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఓసీ కోటాలో పెమ్మసాని చంద్రశేఖర్‌కు సెంట్రల్ క్యాబినెట్‌లో బెర్తులు కల్పించి సామాజిక న్యాయం పాటించారు. మూడో మంత్రి పదవి తీసుకుని రాయలసీమ నుంచి ప్రాతినిధ్యం కల్పిస్తే ప్రాంతీయ సమీకరణలు సరిపోతాయని భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇక ఈ పదవిని ఎస్సీ లేదా బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలని కూడా ఆలోచిస్తున్నారట.ఎస్సీ సామాజిక వర్గం నుంచి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు..బీసీ కోటాలో హిందూపూర్ ఎంపీ పార్థసారథి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే కేంద్ర మంత్రివర్గంలో జనసేన ఉండాల్సిందేనని బీజేపీ పెద్దలు కోరుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ, బీజేపీల నుంచి సెంట్రల్ క్యాబినెట్‌లో ఏపీకి ప్రాతినిధ్యం ఉంది. జనసేనను కూడా కలుపుకుంటే కూటమి పార్టీలకు సమ న్యాయం చేసినట్లు అవుతుందని కేంద్ర బీజేపీ పెద్దలు భావిస్తున్నారట.వర్షాకాల సమావేశాల తర్వాత కేంద్ర మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంటున్నారు. నాగబాబుకు కేంద్రమంత్రి పదవి ఇవ్వాలనుకుంటే..ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోపు రాజ్యసభకు పంపాల్సి ఉంటుంది. దీంతో నాగబాబు కేంద్ర క్యాబినెట్‌లోకి వెళ్తారా లేక స్టేట్ క్యాబినెట్‌లోకి తీసుకుంటారా అనేది ఇప్పుడైతే పూర్తి క్లారిటీ లేదు. ఏది ఏమైనా నాగబాబు మంత్రి అవడం ఖాయం..అది కేంద్రమా రాష్ట్రమా అన్నదే తేలాల్సి ఉందంటున్నారు జనసేన నేతలు. సేమ్‌టైమ్ కేంద్ర క్యాబినెట్‌లో మరో దక్కనుండటంతో టీడీపీ నేతలు కూడా హ్యాపీగా ఉన్నారట. ఇది ఎంతవరకు నిజమవుతుందో చూడాలి మరి.

# చెల్లికి కేటీఆర్ షాక్..! కవిత రాగం కారు దిగేందుకేనా?

హైదరాబాద్,కన్ఫ్యూజన్స్ వీడుతున్నాయ్. అన్నాచెల్లెల్ల మధ్య వైరం పీక్ లెవల్‌కు చేరుకున్నట్లే కనిపిస్తోంది. పార్టీతో ఆమె బంధం కూడా తెగినట్లేనన్న టాక్ కూడా వినిపిస్తోంది. బీఆర్ఎస్ తీరుపై డైరెక్ట్‌గానే అటాక్ చేస్తున్నారు ఎమ్మెల్సీ కవిత. పైగా కారు పార్టే తన లైన్‌లోకి రావాల్సిందే అంటున్నారు. అంటే కారు దిగాలని కవిత ఫిక్స్ అయిపోయారా.? ఇక సస్పెన్స్‌లు, వేచి చూడడాలేమ్ ఉండవా.? అంటే ప్రజెంట్ సిచ్యువేషన్ చూస్తుంటే..కవిత సంచలన నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయ్యారన్న టాక్ వినిపిస్తోంది.ఆమె గులాబీ పార్టీకి రాంరాం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయంటున్నారు. ఇదే సమయంలో కవిత, కేటీఆర్ మధ్య కోల్డ్ వార్ కాస్త..డైరెక్ట్ వార్‌గానే కనిపిస్తోంది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కవిత కొనసాగుతున్నారు. ఉద్యమసయమంలో ఈ సంఘానికి హరీష్ రావు గౌరవాధ్యక్షుడిగా ఉంటే..అధికారంలోకి వచ్చాక ఈ సంఘం కవిత చేతుల్లోకి వచ్చింది. ఇప్పుడు ఆమె నుంచి ఆ బాధ్యతలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్‌కు అప్పగించారు కేటీఆర్. దీంతో కవితకు కేటీఆర్ షాక్ ఇచ్చారనే టాక్ మొదలైంది. తెల్లారే మీడియాతో చిట్‌చాట్‌లో..బీఆర్ఎస్‌పై డైరెక్ట్‌గానే అటాక్ చేశారు కవిత.

### సొంత పార్టీని ఇరుకున పెట్టేలా కామెంట్స్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంత పార్టీని ఇరుకున పెట్టేలా చేసిన కామెంట్స్ సంచలనం రేపుతున్నాయి. రేవంత్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థించారు. ఆర్డినెన్స్ సరైనదే, బీఆర్ఎస్ లీడర్లు వ్యతిరేకించడం తగదంటున్న ఆమె..బీఆర్ఎస్ వాళ్లు తనదారికి రావాల్సిందే..అందుకు కాస్త టైమ్ పడుతుందంతే అంటున్నారు. మొన్నటివరకు పార్టీనే తనదని..బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెప్పిన కవిత..ఇప్పుడు ఏకంగా పార్టీనే తనదారిలోకి రావాల్సిందేనని కామెంట్ చేయడంపై ఆసక్తికర చర్చే జరుగుతోంది.తీన్మార్ మల్లన్న తనపై చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ రియాక్ట్ కాకపోవడంపై కూడా కవిత తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ లీడర్లు రియాక్ట్ కాకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. అలా TBGKS ఇంచార్జ్‌గా కొప్పుల నియామకం..తెల్లారే కవిత కామెంట్స్ చూస్తుంటే..కేటీఆర్ కవిత మధ్య పెద్ద గ్యాపే ఉందన్న చర్చ జరుగుతోంది. అందుకే బీఆర్ఎస్‌లో, ఆ పార్టీ అనుబంధ సంఘాల్లో కవిత ప్రాధాన్యతను తగ్గిస్తున్నారనే టాక్



వినిపిస్తోంది.కవిత కూడా కన్ఫ్యూజన్ వీడి..పొలిటికల్ ఫ్యూచర్‌పై క్లారిటీకి వచ్చారని అంటున్నారు. జాగృతి పేరుతో యాక్టివిటీని ఇంకా స్పీడప్ చేయాలని ఫిక్స్ అయ్యారట. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేయాలనే ఆలోచనకు ఆమె వచ్చినట్లు ఇన్ సైడ్ టాక్. అయితే ఏ పార్టీలోకి వెళ్లకుండా..వచ్చే ఎన్నికల నాటికి సొంతంగా బలపడాలనేది కవిత ఆలోచన అంటున్నారు. అప్పుడు బీఆర్ఎస్సే ఓ మెట్టు దిగి వస్తుందని..తన డిమాండ్లు ఏవైనా ఉంటే అప్పుడు సాధించుకోవచ్చని భావిస్తున్నారట.అందుకే బీఆర్ఎస్సే తనదారిలోకి రావాలని అంటున్నారట కవిత. అయితే ఆమె కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని టాక్ నడిపిస్తున్నప్పటికీ ఈ విషయంపై మాత్రం కవిత క్లారిటీ ఇవ్వడం లేదు. ఇవేవి పట్టించుకోకుండా..తాను లైమ్‌లైట్‌లో ఉంటూ..తన చుట్టూనే చర్చ జరిగేలా స్కెచ్ వేస్తున్నారు కవిత. టైమ్ చూసి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తూ న్యూస్ హెడ్‌లైన్‌గా మారుతున్నారు.అయితే కవిత కారు దిగడం పక్కా అని అంటున్నారు. మరి కారు దిగితే కాంగ్రెస్ గూటికా? సొంత కుంపటా అనేది క్లారిటీ లేదు. బట్ తెలంగాణ పాలిటిక్స్‌లో తానూ ఒక స్ట్రాంగ్ ఫోర్స్‌గా ఉండాలనేది కవిత పట్టుదలగా చెబుతున్నారు. ఆమె రాజకీయ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో చూడాలి మరి. మరోవైపు కేసీఆర్ కూడా ఈ అంశంపై తాడోపేడో తేల్చేయాలనే ఆలోచనలోనే ఉన్నారనే టాక్ నడుస్తోంది. ఎవరు ముందు డెసిషన్ తీసుకుంటారో చూడాలి మరి.

# మౌనం వీడిన ధర్మాన..! తగ్గేదేలే అంటూ స్కెచ్‌లు..!



అమరావతి,సిక్కోలు సిన్సియర్, సీనియర్ పొలిటిషియన్..మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు..ఏడాది తర్వాత మౌనం వీడి మదిలో మాటను చెప్పేశారు. పార్టీ ఆదేశానుసారం తాను లోక్‌సభకో, రాజ్యసభకో వెళ్తానంటున్నారు. ఆవేవి కుదరకపోతే సాధారణ కార్యకర్తగా జెండా మోసుకుని తిరుగుతానని..అంతే గాని అతీగతీ లేని పార్టీల్లోకి వెళ్లనంటూ గట్టిగానే చెప్పుకొచ్చారు. తాను పనిచేయలేకపోతే మరో వ్యక్తిని ఇంచార్జ్‌గా నియమిస్తామన్నారు.సంవత్సర కాలంగా శ్రీకాకుళం వైసీపీ చేపట్టిన కార్యక్రమాలన్నింటికీ దూరంగా ఉంటూ వచ్చారు ధర్మాన. కానీ బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ..రీకాల్ చంద్రబాబు మ్యానిఫెస్టో.. పేరుతో వైసీపీ చేపట్టిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో తలుక్కుమన్నారు. రాను రానంటూనే కార్యక్రమానికి వచ్చిన ధర్మాన..కార్యకర్తలకు ఫుల్ బూస్టింగ్ ఇచ్చి మరీ జోష్ నింపారు. తన గురించి ఎవరూ ఆలోచించొద్దన్న ఆయన..త్వరలో యాక్టీవ్ అవుతానని..ఆరోగ్యం వంటి వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉంటున్నానని చెప్పుకొచ్చారు. క్యాడర్ మాత్రం కార్యక్రమాలు చేసుకుంటూ పోవాలని దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల తర్వాత ధర్మాన ప్రసాదరావు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

### నచ్చజెప్పే ప్రయత్నం చేసినా తగ్గేదేలే..

అధినేత జగన్ ఎంత చెప్పినా..సీనియర్ నేతలైన రీజనల్ ఇంచార్జ్‌లు బొత్స సత్యనారాయణ, కన్నబాబు కూడా అనేక సార్లు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా తగ్గేదేలే అన్నారు ధర్మాన. రెండేళ్ల వరకు తాను రాజకీయాలు మాట్లాబోనన్న ఆయన..ఎట్టకేలకు ఏడాది తర్వాత మౌనం వీడి..తన పొలిటికల్ ప్లానింగ్ ఏంటో చెప్తూనే కూటమిపై విమర్శల దాడి చేశారు. అయితే తన ప్రసంగంలో రాజకీయ కొత్త పంథాను బయటపెట్టారు ధర్మాన. జిల్లా అభివృద్ధి మంత్రం జపిస్తున్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేసిన పార్టీనే లేదని .. 50 ఏళ్లు గడిచినా వంశధార ప్రాజెక్టును నిర్మించుకోలేకపోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.వైఎస్సార్, జగన్‌లే కోద్దో గోప్పో జిల్లాకు న్యాయం చేశారని..అయినా వెనుకబడే ఉన్నామంటూ చెప్పుకొచ్చారు. జిల్లా అభివృద్ధి కోసం తన పోరాటం సాగుతుందంటూ ధర్మాన ప్రకటించడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థులపై..విమర్శలు మాని..జిల్లాలో సమస్యలపై పోరాటం మొదలు పెట్టాలంటూ ధర్మాన పిలుపునివ్వడం పొలిటికల్ హాట్ టాపిక్ అవుతోంది. సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి..టీడీపీని దెబ్బకొట్టి.. ప్రజల్ని తమవైపు తిప్పుకోవాలనేది ధర్మాన వ్యూహమట. సిక్కోలు సీనియర్ లీడర్ వేస్తున్న కొత్త ప్లాన్లు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి.

# తిట్ల పురాణం కట్టడి చేసే చట్టం...ఏపీకి అవసరమా ?



అమరావతి,రాజకీయ నాయకులు అంటే పూర్వం సేవా భావంతో ఉండేవారు. పైగా హుందాగా వ్యవహరించేవారు. ఒక ప్రజా సమూహానికి ప్రాతినిధ్యం వహించే నాయకులుగా వారు తమను భావించుకునే వారు. అందుకే పది మందీ తమను చూస్తున్నారని తాము ఏమి చేసినా దానిని వారు ఆదర్శంగా తీసుకుంటారని కడు జాగ్రత్తగా వ్యవహరించేవారు.దాంతో ఆనాటి చట్టసభలు అందంగా సాగేవి. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు కూడా వినసొంపుగా ఉండేవి. ఇక సాహిత్యాన్ని పురాణాలను ఇతర అంశాలను ప్రస్తావనకు తెచ్చి మరీ తన ప్రసంగాలకు అందం అద్దేవారు. సభలో విపక్షాలకు ఎక్కువ మాట్లాడే అవకాశం ఇస్తే తమ పరిపాలనకు ఎక్కువ సలహాలు సూచనలు వస్తాయని అధికార పక్షం భావించే రోజులు అవి.సభ్యులు చేసుకునే విమర్శలలో కూడా సున్నితమైన హాస్యం వ్యంగ్యోక్తులు ఉండేవి. అయితే ఇపుడు అసెంబ్లీ లోపలా బయటా కూడా దారుణమైన భాష వాడేస్తున్నారు. ఏది అనాలో ఏది అనకూడదో కూడా హద్దులు పెట్టుకోవడం లేదు. అదేదో సినిమాలో హీరో అంటాడు జనాల మీద సినిమాల ప్రభావం చాలా ఉంది అని. కానీ రాజకీయ జీవుల మీద పంచు డైలాగుల ప్రభావం అయితే చాలానే ఉంది అని అంటున్నారు.ఇదిలా ఉంటే వర్తమానంలో చాలా మంది నాయకులు వాడుతున్న భాష చూస్తే జనాలు సైతం ఏహ్యాభావం పెంచుకుంటున్నారు. ఇందులో వారూ వీరూ అని ఏమీ లేదు, మైకు ఎవరి చేతిలలో ఉంటుందో వారు అని అనుకోవడం సబబు. మరి ఇలాంటి వారిని కట్టడి చేయడం ఎలా అంటే దానికే ఎవరికీ జవాబు తట్టడం లేదు. బాబోయ్ అని చెవులు మూసుకోవడమే జనాల వంతు అవుతోంది.అయితే ఈ తరహా పరుష పదజాలానికి అడ్డుకట్ట వేయడానికి ఒక పరిష్కారం ఉందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అంటున్నారు. ఆయన రాజకీయ నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాటలు మాట్లాడకుండా నియంత్రించేందుకు ఒక చట్టాన్ని చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ నాయకులు హుందాగా రాజకీయాలు నిర్వహించకుండా వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తూ మాట్లాడటానికి వీలు లేని పరుష పదజాలాన్ని ఉపయోగిస్తున్నారని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పైగా తప్పుడు కేసులు పెడుతున్నారని కూడా నాయకులు అంటున్నారని ఆయన ఎత్తి చూపారు. తప్పులు చేసిన వారి మీద కేసులు పెట్టకూడదా అని ప్రశ్నించారు.ఈ నేపథ్యంలో రానున్న శాసనసభ సమావేశాలలో శాసనసభ్యులు ప్రతిపక్ష నాయకులు ఎవరూ కూడా పరుష పదజాలం ఉపయోగించకుండా, వినటానికి వీలు లేని భాషను వాడకూడదని చట్టం చేసే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. మరి యార్లగడ్డ ప్రతిపాదన బాగుంది. దానికి ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ఒక చట్టాన్ని చేస్తుందా అన్నది చర్చగా ఉంది.ఇక చట్టం చేసినా దానిని పాటించేవారు ఉన్నారా అన్నది మరో ప్రశ్న. ఏది ఏమైనా భాష బాగులేదని అంతా అంగీకరిస్తున్నారు తాము మాత్రం మైకుల ముందుకు వచ్చి ఆవేశంతో ఊగిపోతున్నారు. దీనిని స్వీయ నియంత్రణకు మించిన పరిష్కారం లేదు. కానీ అది జరిగేపనేలా. ఏపీ లాంటి చోట్ల అసలు కుదిరే పనేనా అన్నదే చర్చగా ఉంది.

### స్థానిక సంస్థల బలోపేతానికి కృషి

నెల్లూరు,కేంద్రం నుంచి రావల్సిన నిధులు వస్తున్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల నిధులను వారికే కేటాయిస్తామని.. గత ప్రభుత్వం లాగా ఆ నిధులను కూటమి ప్రభుత్వం వాడుకోదని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... సర్పంచ్‌లు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు వారి ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. గతంలో సచివాలయాలు ప్రారంభించి పూర్తి చేయకుండా వదిలి వేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను గాడిలో పెట్టడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఇంటింటికీ వెళ్లి అధికారులు పంపిణీ చేశారని.. వాలెంటరీ వ్యవస్థ లేకుండానే అమలు చేశారని చెప్పుకొచ్చారు. కేంద్రం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్‌లో 28 వేల కోట్లు-రూపాయలు ఇస్తామంటే, 2 వేల కోట్లు- కూడా గత ప్రభుత్వం వినియోగించుకోలేదని విమర్శించారు.

# జలవివాదాలపై విషం చిమ్ముతున్న బిఆర్ఎస్

జనగామ,జలవివాదాలు పరిష్కరించాలని కేంద్రం చొరవ తీసుకుంటే బిఆర్ఎస్ విషం చిమ్ముతోందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏపీ, తెలంగాణ జల వివాదం పరిష్కంచాలని ప్రయత్నిస్తే తప్పుపడుతున్నారని మండిపడ్డారు. నీటి విషయంలో రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడతామని స్పష్టం చేశారు. ఈ సమస్యను జల వివాదం కమిటీ- పరిష్కరిస్తుందని చెప్పుకొచ్చారు. నీటికి సంబంధించి తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని వెల్లడించారు. బీఆర్ఎస్ వాళ్లు మళ్లీ తెలంగాణ వాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అప్పుడు కిషన్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేశారని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు- అనుమానం వస్తోందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్ జల్సాలు చేశారని విరుచుకుపడ్డారు బండి సంజయ్. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఏ గ్రామానికైనా వస్తాం చర్చిద్దామా అంటూ బండి సవాల్ విసిరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. రెండు పార్టీల నేతలు తిట్టు-కోవడమే పనిగా పెట్టు-కున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీ-సీలే తమ ప్రచార కర్తలని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని.. గ్రామీణ వ్యవస్థ సర్వనాశనం అవుతోందని అన్నారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడిన-ల్గ÷టెందంటూ వ్యాఖ్యలు చేశారు కేంద్రమంత్రి. తెలంగాణకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి రేపు (శనివారం) వస్తున్నారని, వ్యాగన్



ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని స్కామ్‌లు పక్కకు పోయాయని.. ఏ ఒక్క స్కామ్‌లోనూ కేసీఆర్ కుటు-ంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. రెండు పార్టీలు ఒక్కటే అని.. 'నువ్వు కొట్టినట్టు- చెయ్ నేను ఏడ్చినట్టు- చేస్తా' అనే ధోరణిలో ఉన్నారంటూ కేంద్రమంత్రి బండి వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బీసీలకు రేవంత్ సర్కార్ అన్యాయం చేస్తోందని ఆరోపించారు. 42 శాతంలో 10 శాతం ముస్లింలే ఉన్నారని.. ఇప్పటికే ఉన్న 23 శాతంలో అదనంగా ఇచ్చేది ఐదు శాతమే అని అన్నారు. బీసీలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ప్రజాప్రతినిధులు కావాల్సిన బీసీల స్థానాల్లో ఎంఐఎం వాళ్లు అయ్యారన్నారు. ఇప్పుడు జనాభా దామాషా ప్రకారం బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని.. దాంట్లో ముస్లింలను కలపొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# మేడిగడ్డ బరాజ్‌కు తగ్గిన ప్రవాహం..



మహదేవపూర్(కాళేశ్వరం), జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ వల్ల మేడిగడ్డ బరాజ్‌కు ప్రవాహం త గ్గింది. శుక్రవారం 82,330 క్యూసెకుల ప్రవాహం రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తివేస్తే మొత్తం నీటిని దిగువకు అధికారులు విడుదల చేస్తున్నారు. నీటి ప్రవాహం బరాజ్ రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 89.90 మీటర్ల ఎత్తులో ఉందని భారీ నీటిపారుద లశాఖ అధికారులు తెలిపారు. అదేవిధంగా కాళేశ్వరంలో ప్రాణహిత వరద ప్రవాహం తగ్గింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com